ఈనాడు విశాఖపట్నం

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం



ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి 10.30 గంటలకు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. ఉదయ్‌పూర్ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ప్రత్యేక వాహనశ్రేణిలో నగరంలోని తెదేపా కార్యాలయానికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఓ కేసు నిమిత్తం కోర్టు వాయిదాకు హాజరుకానున్నారు.

ఈనాడు, విశాఖపట్నం

వివాదాస్పదం.. అదే వరం!



రూ.వేల కోట్ల భూములు వైకాపా నేతల చేతుల్లో | నాటి కేటాయింపులు, అక్రమాలపై ప్రభుత్వం ఆరా

విశాఖలో వివాదాస్పద భూములు కొన్ని గత ప్రభుత్వ హయాంలో వైకాపా పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే దర్జాగా ప్రైవేటు పరం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. రూ.వందల కోట్ల విలువైన భూములను నామమాత్రపు ధరకు కేటాయించేశారు.

ఇలా రూ.వేల కోట్ల భూములు కీలక నేతల గుప్పెట్లోకి వెళ్లాయి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఆ భూముల వ్యవహారాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. వాటితో పాటు ఇతరత్రా సమస్యలున్న భూములకు సంబంధించిన నివేదికలు జిల్లా అధికారుల నుంచి అమరావతికి వెళుతున్నాయి.

1



స్థలం : హయగ్రీవ
ప్రాంతం : ఎండాడ
విస్తీర్ణం : 12 ఎకరాలు
విలువ : రూ.250 కోట్లు

జరిగింది : వృద్ధులు, అనాథల కాటేజీల నిర్మాణం కోసం 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 12.51 ఎకరాలు హయగ్రీవ డెవలపర్స్‌కు ఎకరా రూ.45 లక్షలకు కేటాయించింది. గడువులోగా ఆ నిర్మాణాలు పూర్తవ్వలేదు. వైకాపా ప్రభుత్వం వచ్చాక దీని కథ మారిపోయింది. ఆ స్థలం అసలు యజమాని నుంచి వైకాపా నేతల చేతుల్లోకి వెళ్లిపోయింది. కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా అక్కడ నిర్మాణాలు జరగడం వివాదాస్పదమైంది. అప్పట్లో జిల్లా కలెక్టరు ఇచ్చిన నివేదికలు చర్చనీయాంశమయ్యాయి. ఒక్కోసారి ఒక్కోలా ఇచ్చారు. చివరిగా ప్రభుత్వానిదే తుది నిర్ణయమని తేల్చారు. కోర్టులోనూ దీనిపై వాదనలు జరుగుతున్నాయి.

2

స్థలాలు : 296, 301, 388, 279 జీవోల ప్రకారం ప్రభుత్వ భూముల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నవి.

ప్రాంతాలు : ఆరిలోవ, సింహాచలం, హనుమంతువాక పరిసరాలు

జరిగింది : గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి హక్కులు కల్పించి పట్టాలు ఇచ్చారు. రెండేళ్లకే రిజిస్ట్రేషన్లు చేయాల్సినప్పటికీ ప్రభుత్వం మారింది. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పని పూర్తిగా చేయలేదు. దీనిపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టరు ఈ రిజిస్ట్రేషన్లకు సంబంధించి నివేదికను తాజాగా ప్రభుత్వానికి పంపారు.

3

స్థలం: శారదాపీఠం
ప్రాంతం : భీమిలి మండలం కొత్తవలస
విస్తీర్ణం : 15 ఎకరాలు
విలువ : రూ.225 కోట్లు

జరిగింది : పెందుర్తి మండలం చినముషిడివాడలోని శారదాపీఠానికి భీమిలి మండలం కొత్తవలసలో 15 ఎకరాలు గత వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. ఎకరా రూ.లక్ష చొప్పున రూ.15 లక్షలకు అప్పగించేశారు. బహిరంగ మార్కెట్‌లో అక్కడ ఎకరా రూ.15 కోట్లుంది. అంతటి విలువైన స్థలాన్ని తక్కువకు ఇచ్చి ప్రభుత్వ ఆదాయానికి తీవ్ర నష్టం కలిగించేలా నాటి ప్రభుత్వం వ్యవహరించింది.



4



స్థలం : దసపల్లా
ప్రాంతం : ప్రభుత్వ అతిథిగృహం సమీపంలో
విస్తీర్ణం : 15 ఎకరాలు
విలువ : రూ.2 వేల కోట్లు

జరిగింది: ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దసపల్లా భూములు గత ప్రభుత్వంలో ప్రైవేటుపరం అయిపోయాయి. గత ప్రభుత్వాలు ఈ భూములను రక్షించుకుంటూ వస్తే వైకాపా హయాంలో ఆ ప్రయత్నం జరగలేదు. దీంతో 15 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీంతో ఆ భూములను కొందరు పెద్దలు హస్తగతం చేసుకున్నారు. వీటన్నింటినీ మరోసారి పరిశీలించనుంది.

నాస్కామ్ సహకారం.. అంకురాలకు శ్రీకారం

ఈనాడు, విశాఖపట్నం

అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కారం.. | ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ప్రాజెక్టుల



1 ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నెలకొల్పిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా దీన్ని ఏర్పాటుచేశాయి. సీవోఈ సహకారంతో నెలకొల్పిన అంకుర సంస్థలు అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కారాలు చూపుతున్నాయి. ఆ ప్రాజెక్టులను వైద్యారోగ్య, విద్య, తదితర శాఖల్లో ప్రయోగాత్మకంగా చేపట్టారు. ప్రభుత్వ సహకారం అందిస్తే పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు వీలుంటుందని అంకుర సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

మందులు సమయానికి తీసుకునేలా..

2 గర్భిణులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా ఔషధాలు వాడాలి. రోగులు సమయానికి మందులు వాడుతున్నారా.. లేదా.. పర్యవేక్షించేందుకు ఓ అంకుర సంస్థ 'పిల్‌బాక్స్ రిమైండర్' అనే ప్రాజెక్టును రూపొందించింది. ఒక డబ్బాలో మాత్రలన్నీ పెడితే.. సాంకేతిక సహాయంతో మందులు వేసుకోవాల్సిన సమయానికి అలర్ట్ వస్తుంది. అప్పుడు డబ్బా తెరిచి, మందులు వేసుకున్నారా.? లేదా? అనే వివరాలు కూడా తెలుసుకోవచ్చు. దీన్ని విశాఖ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుచేశారు. దీన్ని విశ్లేషించి అవసరమైన మార్పులు సూచిస్తే, పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అంకుర సంస్థ యజమాని ఎం.శ్రీనివాస్ చెబుతున్నారు.



అంకుర సంస్థ రూపొందించిన 'ఔషధాల డబ్బా'

గర్భిణులను పరీక్షించేందుకు..

గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ఆరోగ్య కేంద్రాలకు వచ్చేందుకు సంకోచిస్తుంటారు. దీంతో ఆశా కార్యకర్తలు అన్ని యంత్రాలు మోసుకెళ్లి బీపీ, తదితరాలు పరీక్షిస్తుంటారు. 'సేవ్ మామ్' అనే అంకుర సంస్థ చేతిలో ఇమిడే పరికరాన్ని తీర్చిదిద్దింది. దీంతో సులభంగా గర్భిణుల్లో బీపీ, గుండె స్పందన, ఆక్సిజన్‌స్థాయిలు, ఉష్ణోగ్రత తెలుసుకోవచ్చు. దీని ద్వారా 3 నెలలపాటు 3000 మంది గర్భిణులను పరీక్షించారు. ఆ వివరాలను ఆసుపత్రుల్లోని యంత్రాల్లో పరీక్షించిన విలువలతో సరిపోల్చగా 98 శాతం కచ్చితత్వం కనిపించింది. ఆరోగ్యశాఖ ఆ సాంకేతికత బాగుందని ధ్రువపత్రం ఇవ్వగా.. ఆ సంస్థ తమిళనాడులో భారీ ప్రాజెక్టు కైవసం చేసుకుంది.

3 టెలీ పాథాలజీ సేవలు..

కణజాలం, ఇతర కీలక పరీక్షలు చేసేందుకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సరైన సదుపాయాలు లేవు. పాథాలజిస్టులు లేకపోవడంతో రోగులు జిల్లా కేంద్రాసుపత్రులకు అనకాపల్లి లేదా విశాఖ వెళ్లాల్సి ఉంటుంది. దీంతో చాలా మంది రోగులు ఆ పరీక్షలు చేయించుకోవట్లేదు. దీనికి పరిష్కారంగా ఓ అంకుర సంస్థ 'టెలీ పాథాలజీ' అనే సదుపాయాన్ని అభివృద్ధి చేసింది. వైద్యారోగ్యశాఖతో కలసి అనకాపల్లి జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో దీన్ని పరీక్షించారు. అవసరమైన పరికరాలు సమకూర్చి, టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. దీంతో రోగులకు పరీక్షలు చేసి, ఆ వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు.

- జిల్లా కేంద్రాసుపత్రిలోని పాథాలజిస్ట్ సాఫ్ట్‌వేర్‌లో చూసి, నివేదికలు ఇచ్చేవారు. తర్వాత దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని భావించినా ముందుకు సాగలేదు. ఆ సంస్థ ఈ ప్రాజెక్టును నాస్కామ్ సహకారంతో చండీగఢ్‌లో నిర్వహిస్తున్నారు.



పీహెచ్‌సీలో మైక్రోస్కోప్‌లో నమూనాలు పరీక్షిస్తున్న టెక్నీషియన్

గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి: కలెక్టర్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో లబ్ధిపొందిన వారికి 2.0 పథకంలో అవకాశం ఉండబోదని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో వ్యవహరించి లేఅవుట్లలో చేపట్టిన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారు సైతం పనులు వేగవంతం చేయాలన్నారు. రోజువారీ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని గృహ నిర్మాణశాఖ అధికారులు పని చేయాలని ఆదేశించారు.

బల్క్ నీటి అవసరాలపై సమీక్ష

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంత నీటి అవసరాల నిమిత్తం గురువారం కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థలో జీవీఎంసీ అధికారులు సమీక్ష నిర్వహించారు. కమిషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశ్రమలకు అవసరమయ్యే బల్క్ పరిమాణం గల నీటి వనరులు, సరఫరా విధానం, నిల్వలు... తదితర అంశాలను ప్రస్తావించారు. తూర్పునౌకాదళం, హిందుస్థాన్ షిప్‌యార్డు, మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్, భారతీయ తీరగస్తీ దళం, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీల నుంచి ప్రత్యేక ప్రతినిధులు హాజరై తమకు అవసరమైన నీటి సరఫరా, పరిమాణ వివరాలపై స్పష్టత ఇచ్చారు.

అదుపు తప్పిన వేళ..!

- సేవా రహదారిపై భారీ క్రేన్ ప్రమాదం
- రాకపోకలు నిలిచి ప్రజలకు ఇక్కట్లు



పైపులైను కూడలిలో ప్రమాద స్థలిలో...

న్యూస్‌టుడే, సింధియా

పారిశ్రామిక ప్రాంతం సింధియా కూడలి - డాక్‌యార్డు మార్గంలోని పైపులైన్ కూడలిలో గురువారం ఉదయం భారీ క్రేన్ అదుపుతప్పి పక్కకు ఒరిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించారు. నిర్వాహకులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఆ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించారు.

సమయం ఉదయం 6 గంటలు డాక్‌యార్డు, ఆయిల్‌జెట్టీ, ఎరువుల కర్మాగారానికి చెందిన ఎల్ఎస్‌టీ (గంధక ద్రావణం) టెర్మినల్స్‌కు సమీపంలోనే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీ)కు సంబంధించి పైపులైన్ల ఏర్పాటు పనులను అధికారులు ప్రారంభించారు.

సమయం ఉదయం 7.00 పనులు నిర్వహిస్తున్న భారీ క్రేన్ ఒకటి అదుపు తప్పింది. అప్రమత్తమైన సిబ్బంది అక్కడ నుంచి పరుగులు తీశారు. క్రేన్ పక్కకు ఒరిగిపోయిన సమాచారం అందుకున్న ఐఓసీ అధికారులు అక్కడకు చేరుకుని, సహాయక చర్యలకు ఏర్పాట్లు చేశారు.

సమయం ఉదయం 7.30 డాక్‌యార్డుతో పాటు, ఇతర సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు విధులకు హాజరయ్యేందుకు ఆ మార్గంలో ప్రయాణిస్తూ... ఒక్కొక్కరిగా ప్రమాదస్థలికి చేరుకున్నారు. ముందుకెళ్లే వీల్లేకపోవడంతో ఈఎన్‌సీ కమాండు రోడ్డు, ఆయిల్ వార్ఫ్ జెట్టీ రోడ్డుకు ఇరువైపులా తమ వాహనాలను నిలిపేసి, కాలినడకన విధులకు వెళ్లారు.

సమయం ఉదయం 8.30 సహాయక చర్యలకు అవసరమైన మరో రెండు భారీ క్రేన్లు అక్కడకు చేరుకున్నాయి. సిబ్బంది, అధికారుల సమన్వయంతో పనులు చేపట్టారు. సుమారు నాలుగున్నర గంటల సేపు పనులు కొనసాగాయి.



సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

సమయం మధ్యాహ్నం 1.00 ఎట్టకేలకు సహాయక పనులు పూర్తవడంతో... ఆ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ ప్రారంభించారు.

రద్దీ వేళ కీలక పనులా..?: పారిశ్రామిక ప్రాంతం సేవా రహదారిలో నిత్యం ఉదయం, సాయంత్రం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీ నెలకొంటుంది. ఆ సమయంలో రోడ్ల వెంబడి భారీ క్రేన్లతో పనులు చేపట్టడంతో భద్రతరీత్యా సరి కాదని వాహన చోదకులు అన్నారు.

తప్పని ఇక్కట్లు: వివిధ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు ఉదయం తమ ద్విచక్ర వాహనాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడే నిలిపి విధులకు వెళ్లారు. సాయంత్రం తిరిగొచ్చి తమ వాహనాలను తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే గాజువాక నుంచి నగరంలోకి వెళ్లే వాహనచోదకులంతా జింక్- బీహెచ్‌పీవీ జాతీయ రహదారిలో, ఏకశిల- శ్రావణ్ షిప్పింగ్- పోర్టు రోడ్డులోనూ ప్రయాణించారు. ఓ వైపు వర్షం, మరోవైపు ట్రాఫిక్‌తో తీవ్ర అసహనానికి గురయ్యారు. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు, నేవీ పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



రహదారిపై ఆగిపోయిన ఉద్యోగులు

ఖజానా శాఖ ఉద్యోగులపై విచారణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా ఖజానా శాఖలో పనిచేస్తున్న ఒక ఏటీఓ (సహాయ ట్రెజరీ అధికారి)తో పాటు ఇద్దరు అకౌంటెంట్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా జిల్లా ఖజానా శాఖ ఇన్‌ఛార్జి డీడీ గోవిందరావును నియమించింది. పంచాయతీరాజ్, సబ్‌రిజిస్ట్రార్, సాగునీటిపారుదల శాఖలకు చెందిన బిల్లులు క్లియర్ చేసేందుకు ఖజానా శాఖ అధికారులు మామూళ్లు అడుగుతున్నారని, డబ్బులు ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పించుకుంటున్నారని సీఎంఓకు ఫిర్యాదులు వెళ్లాయి. ఫిర్యాదు పత్రాలపై ఎవరి సంతకాలు లేవు. వాటి ఆధారంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఎంఓ నుంచి జిల్లా ఖజానా శాఖకు ఆదేశాలు వచ్చాయి. దీనిపై ఇన్‌ఛార్జి డీడీ గోవిందరావు విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి నుంచి వివరణ తీసుకున్నారు. ఫిర్యాదులో ప్రస్తావించిన మూడు శాఖలకు చెందిన డీడీఓలను పిలిచి వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. ఎవరెవరికి మామూళ్లు ఇచ్చారు? ఎంత మొత్తంలో చెల్లించారు? ఎటువంటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎంత కాలం నుంచి ఆయా బిల్లులు క్లియర్ చేయలేదు? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. విచారణ పూర్తి చేసిన తర్వాత నివేదికను ఖజానా శాఖ సంచాలకుల ద్వారా ప్రభుత్వానికి పంపనున్నారు. గతంలో కూడా ఇటువంటి ఫిర్యాదులు వచ్చాయి. అప్పట్లో ఖజానా శాఖ సంచాలకులు విచారణ జరిపి కొందరి సీట్లు మార్చారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం.

కుండపోత.. పిడుగుల మోత

నగరంలో భారీ వర్షం





సీతకొండ మలుపులో జారిపడిన రాళ్లు



మేహాద్రి రిజర్వాయరు గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఈనాడు, విశాఖపట్నం: వాయుగుండం ప్రభావంతో నగరంలో భారీ వర్షం కురిసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి పిడుగుల మోతతో విశాఖ దద్దరిల్లింది. గురువారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. సముద్రం కొంత మేర ముందుకొచ్చింది. ఆర్కే బీచ్ వద్ద అలలు దుకాణాలను తాకాయి. శుక్రవారం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

20 ప్రాంతాల్లో 50 మి.మీ. వర్షం: బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు హెచ్‌బీ కాలనీలో 79 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, సాగర్‌నగర్, జూపార్కు, కాపులుప్పాడ, పెదవాల్తేరు సహా 20 ప్రాంతాల్లో 50 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

- గురువారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు అత్యధికంగా సాగర్‌నగర్‌లో 62 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం ఇలా.. (మిల్లీమీటర్లలో)

సాగర్‌నగర్	62	ఆరిలోవ	36
జోగవానిపాలెం	52	ఎంవీపీ కాలనీ	35
ఎండాడ	50	హెచ్‌బీ కాలనీ	34
విశాఖ వ్యాలీ పాఠశాల	45	మధురవాడ	31
తులసీనగర్	37	మల్కాపురం	30



పెందుర్తి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు



ఎంవీపీ కాలనీలో పూడిక, ఆక్రమణలతో నిండిన గెడ్డలో ప్రవాహం ఇలా..

పర్యాటక బోట్లు తీరానికే పరిమితం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో విన్యసించే ఆరు పర్యాటక స్పీడు బోట్లను బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నిలిపివేశారు. సాగరంలో బలమైన ఈదురుగాలులు వీయడం, అలలు ఉగ్రరూపం దాల్చడం ఇతరత్రా ప్రతికూల పరిణామాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక టూరిజం స్పీడు బోటు కంట్రోల్ రూం పర్యవేక్షణలో నడిచే ఆరు పడవల్ని జిల్లా ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికల మేరకు ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు గురువారం వెల్లడించారు.



దీన్‌దయాళపురంలోని వీధి బాలల వసతి గృహం వద్ద కూలిన రక్షణ గోడ



పెదగంట్యాడ మండలం కొంగపాలెంలో కూలిన షెడ్డు

'లాటరీ'లో గెలిచి.. కంటైనర్‌లో విక్రయించి

నూతన విధానంలో 'లాటరీ'లో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు అమ్మకాలు ప్రారంభించారు. విశాఖ మహానగరంలో ఒక్క రోజు విక్రయాలు అయినా భారీగా ఆదాయం కొల్లగొట్టాలనే.. ఓ లైసెన్స్‌దారు అక్కయ్యపాలెం జగ్గరావు బ్రిడ్జి వద్ద దుకాణం ఏర్పాటు చేయాలనుకున్న చోట భవనం నిర్మాణంలో ఉంది. దీంతో సమయం వృథా కాకుండా ఇలా కంటైనర్‌లోనే దుకాణం ప్రారంభించేశారు. భవనం పూర్తికాగానే అందులోకి మార్చుతామని చెబుతున్నారు. – ఈనాడు, విశాఖపట్నం



కంటైనర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం


తీరంలో ఇసుక తిన్నెల్లో కూరుకుపోయిన నౌక


తెగిపోయిన గొలుసులు

ఉగ్రరూప అలలు... తెగిన ఇనుప తీగలు

కొన్నేళ్ల క్రితం తుపాను తీవ్రతకు విశాఖ తీరానికి కొట్టుకువచ్చిన బంగ్లాదేశ్ నౌక 'ఎంవీ మా' నాటి నుంచి ఇక్కడే ఇసుకలో ఉండిపోయింది. విశాఖ వచ్చే పర్యాటకుల్లో చాలా మంది ఆ నౌక వద్దకు వచ్చి సెల్ఫీ చిత్రాలు తీసుకుంటూ ముచ్చటపడి పోతున్నారు. ఓ ప్రైవేటు సంస్థ దానిని సొంతం చేసుకుంది. వాయుగుండం ప్రభావంతో ఎగసిపడిన అలల తీవ్రతకు ...నౌకకు కట్టిన భారీ ఇనుప గొలుసులు గురువారం తెగిపోయాయి. దీంతో సదరు సంస్థ సిబ్బంది నౌక వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. – ఈనాడు, విశాఖపట్నం


భద్రతా చర్యలు చేపడుతున్న సిబ్బంది

నాల్గో పర్యాయం మేహాద్రి రిజర్వాయరు గేటు ఎత్తివేత


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఈఈ విజయకుమార్, డీఈ స్వామినాయుడు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మేహాద్రి రిజర్వాయరు గేట్లను ఇప్పటికి నాలుగు పర్యాయాలు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. అల్పపీడనం కారణంగా బుధవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రిజర్వాయర్‌లోకి నీరు భారీగా చేరింది. దీంతో 61 అడుగుల గరిష్ఠ నీటిమట్టం ఉన్న రిజర్వాయరు గురువారం సాయంత్రానికి 59.8 అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెండో నంబరు గేటుని మూడు అంగుళాల మేర ఎత్తి 175 క్యూసెక్కుల నీటిని వదిలి సముద్రంలోకి పంపిస్తున్నారు. రిజర్వాయరు పరిస్థితిని పరిశీలించేందుకు ఇటీవల బదిలీపై వచ్చిన డీఈ జె.స్వామి నాయుడు, ఈఈ ఆర్.విజయ్‌కుమార్‌లు వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బరాజుతో కలిసి పరిశీలించారు. ఇక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

సెంచురీ పరుపుల షోరూం ప్రారంభం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం సమీపంలో సెంచురీ మ్యాట్రెస్ షోరూంను ఎంపీ ఎం.శ్రీభరత్ గురువారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ అన్ని రకాల పరుపులపై 15శాతం రాయితీ ఉందని, ఉచిత బహుమతులు 15వేల వరకు ఉన్నాయన్నారు. స్ప్రింగ్, ఫోమ్, కొబ్బరిపీచు తదితర అన్ని రకాల సాధారణ పరుపులు మొదలు అత్యంత విలాసవంతమైనవన్నీ ఇక్కడ లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ హోమ్ కంఫర్ట్స్ వ్యవస్థాపకులు రాజేష్ అగర్వాల్, వందనా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

కార్మికులకు రూ.32లక్షలతో పాదరక్షల కొనుగోలు

❑ 85 అంశాలతో అజెండా తయారీ ❑ నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని జీవీఎంసీ కార్యదర్శి బి.వెంకటరమణ తెలిపారు. 85 అంశాలతో అజెండా తయారు చేసి సభ్యులకు అందజేసినట్లు చెప్పారు. ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయరు గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

★ పారిశుద్ధ్య కార్మికులకు రూ.32లక్షలతో చెప్పులు కొనుగోలు చేసే అంశాన్ని ప్రతిపాదించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు మంచినీటిని సరఫరా చేసిన అంశాన్ని మూడోసారి అజెండాలో పొందుపరిచారు. వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఇప్పటికే రెండుసార్లు దీన్ని సభ్యులు వాయిదా వేశారు. మూడో సారి కౌన్సెల్ అజెండాలో ఈ అంశాన్ని చేర్చాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా స్థాయీలో ప్రతిపాదించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీవీఎంసీ 8వ వార్డులో తారకరామనగర్ పార్కు, రెవెన్యూ లే అవుట్ ప్రాంతంలో రహదారి నిర్మాణాన్ని ప్రతిపాదించారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏయూ, జెడ్పీలో మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టామని, వాటికి బిల్లులు చెల్లించాలని కోరారు. ఆయా అంశాలను గత సమావేశంలో సభ్యులు వాయిదా వేసినా మళ్లీ ప్రవేశ పెట్టడానికి సిద్ధమవడం గమనార్హం. మలేరియా కార్మికులకు వేతనాలు, వారి సేవల పొడిగింపు అంశాలను చేర్చారు. అయితే వారు ఎక్కడ పనిచేస్తున్నారు, హాజరు ఎవరు నమోదు చేస్తున్నారో తెలియని పరిస్థితి. స్వీపింగ్ యంత్రాలు, వాహనాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి టెండర్లు పిలవడానికి అనుమతి కోరారు.

తహసీల్దార్ అంబేడ్కర్‌పై క్రమశిక్షణ చర్యలు

ఆనందపురం, న్యూస్‌టుడే: గతంలో ఆనందపురం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఎస్.వి.అంబేడ్కర్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వర్తించిన సమయంలో ఆయనపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ మేరకు ఆయనకు మూడు వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్య తీసుకున్నారు. ప్రస్తుతం ఈయన అనకాపల్లి జిల్లాలో పని చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా రాయితీ నూనెల విక్రయం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రైతుబజార్లలో రాయితీ వంట నూనెలను క్యూఆర్ కోడ్ ద్వారా విక్రయిస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.124, పామాయిల్ లీటరు రూ.110 చొప్పున విక్రయిస్తామన్నారు. ఒక్కో బియ్యం కార్డుపై 3 లీటర్ల పామాయిల్, ఒక లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ ఇస్తామని చెప్పారు. వినియోగదారులు రైతుబజార్‌లోని ఎస్టేట్ అధికారిని సంప్రదించి బియ్యం కార్డు, చరవాణి నెంబరు తెలియజేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే 0891-2590100,2590102 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఖోఖో ఎంపిక పోటీలు వాయిదా

అగనంపూడి, న్యూస్‌టుడే: గాజువాక శివారు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించాల్సిన ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు వాయిదా పడ్డాయి. వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

చిన్నారిపై అత్యాచారం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడలో ఓ చిన్నారి(6)పై ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొమ్మాది సమీప ప్రాంతానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు అదే కాలనీలోని ఆరేళ్ల బాలికపై మంగళవారం అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రులు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈ కేసును ఎండాడ మహిళా పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

'ఏడాకుల' చెట్లను ఏం చేస్తారో...

తొలగించాలని స్థానికుల వినతులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : శ్వాసకోశ వ్యాధులకు కారణమయ్యే ఏడాకుల చెట్లు తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డు, కైలాసపురం సత్యసాయినగర్ ప్రాంతాల్లో విపరీతంగా పెరుగుతుండడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్ల పూల నుంచి వచ్చే వాసన వల్ల చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఆస్మా వంటి శ్వాసకోశ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో గతంలో జీవీఎంసీ అధికారులు ఈ చెట్లను ఎప్పటికప్పుడు తొలగించేవారు. ఇటీవల కాలంలో అధికారులు ఏడు ఆకుల చెట్ల గురించి పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతాల్లోని రహదారుల పక్కన ఇవి అధికంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ చెట్లు బాగా పూలు పూస్తుండడంతో వీటి నుంచి వెలువడే వాసన వల్ల చుట్టుపక్కల నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెట్లను తొలగించాలని గతంలో జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక నాయకులు తిరుపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు.


80 అడుగుల రోడ్డులో పూలతో ఏడాకుల చెట్లు | తాటిచెట్లపాలెం రోడ్డులో... | సత్యసాయినగర్‌కు వెళ్లే రోడ్డులో...

వాల్మీకి మహర్షి చిరస్మరణీయులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహాజ్ఞాని, తాత్వికుడు, సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయులని, ఆయన జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. కలెక్టర్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారిణి శ్రీదేవి, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు.


వాల్మీకి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

సమన్వయంతో మాతాశిశు మరణాల నియంత్రణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో మాతాశిశు మరణాలను పూర్తి స్థాయిలో నియంత్రించాలని, దీనికి వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం తన ఛాంబరులో ఆరోగ్యశాఖకు సంబంధించిన కార్యక్రమాల అమలుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని, నీటి నిల్వలు లేకుండా, దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వయోజనుల్లో అర్హులైన వారికి బీసీజీ వ్యాక్సిన్ అందేలా చూడాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీశంకర్, ఇతర వైద్యాధికారులు పూర్ణేంద్రబాబు, ఎస్.జీవనరాణి, నరేష్‌కుమార్, బి.ఉమావతి, అప్పారావు, సమత, తులసి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నైపుణ్యాలకు ప్రోత్సాహం

కరాస, న్యూస్‌టుడే : దేశంలో చేతివృత్తుల్ని, సంప్రదాయ నైపుణ్యాల్ని, హస్తకళల్ని ప్రోత్సహించేందుకు కేంద్రం అన్ని చర్యలు చేపడుతోందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. గురువారం ఐటీఐ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు అర్హులైన వారికి రూ.15వేల విలువైన పనిముట్లు అందించారు. ఈ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే.. శిక్షణ, స్టైఫండ్, టూల్ కిట్‌తో పాటు తక్కువ వడ్డీపై బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జోన్-5 జెడ్సీ బి.రాము, జీవీఎంసీ ఏడీపీ చిరంజీవి, ఇతర అధికారులు, కూటమి నాయకులు అజయ్‌బాబు, చిన్న, కార్తీక్, శ్రీరామ్మూర్తి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు

మూర్ఛ రావడంతో.. మృత్యుఒడిలోకి..!


లోకేశ్‌కుమార్ (పాతచిత్రం)

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడికి మూర్ఛ రావడంతో కిందపడిపోయాడు. ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు గురువారం తెలిపిన వివరాలివి. ఉక్కు కర్మాగరంలో పని చేస్తున్న ఎస్.వెంకటరమణ నిర్వాసిత దిబ్బపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు లోకేశ్‌కుమార్(27) బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై సమీప రైలు పట్టాలు పక్కనున్న రహదారిలో వెళ్లాడు. ఆ సమయంలో మూర్ఛ రావడంతో అక్కడే పడిపోయాడు. పక్కటెముకలు, కాలికి తీవ్ర గాయాలై పైకిలేవలేని స్థితిలో ఉండిపోయాడు. స్థానికులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స కోసం అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీకి హైకోర్టులో ఊరట

● 'హయగ్రీవ' భూముల కేసులో ముందస్తు బెయిల్

ఈనాడు, అమరావతి: హయగ్రీవ సంస్థకు చెందిన భూముల వ్యవహారానికి సంబంధించి విశాఖపట్నం, అరిలోవ ఠాణాలో నమోదైన కేసులో వైకాపా నేత, విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు ఊరట లభించింది. ఆయనతో పాటు బిల్డర్ గద్దె బ్రహ్మాజీ, సీఏ జి.వెంకటేశ్వరరావులకు హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.30 వేలతో ఒక్కొక్కరు రెండు పూచీకత్తులు సమర్పించాలని, మూడు నెలల పాటు ప్రతి నెలా 1, 15వ తేదీలలో దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని ఆదేశించింది. దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలని, ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే ఆయనకు వివరాలు అందజేయాలని షరతు విధించింది. సాక్షులను ప్రభావితం చేయొద్దని, దిగువ కోర్టులో విచారణలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఈ మేరకు తీర్పు చెప్పారు. ఎంఓయూ పేరిట ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకొని విశాఖ జిల్లా ఎండాడ గ్రామంలో తమకు చెందిన విలువైన భూములను కాజేసేందుకు యత్నించారని హయగ్రీవ ఇన్‌ఫ్రాటెక్ అధినేత సీహెచ్ జగదీశ్వరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టాగ్రామ్ పరిచయం

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

రాజానగరం, న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఓ వివాహిత ఆత్మహత్యకు దారి తీసింది. ఈ ఘటన రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చక్రద్వారబంధంలో జరిగింది. దీనికి సంబంధించి సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ తెలిపిన సమాచారం మేరకు.. చక్రద్వారబంధానికి చెందిన ఉల్లి ఉమాదేవికి వివాహమై ఒక పాప ఉంది. ఆమెకు దాదాపు సంవత్సరం క్రితం విశాఖపట్నానికి చెందిన ఒక అపరిచిత వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. అనంతరం ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేసి, ఆమె వద్ద నుంచి బంగారు వస్తువులు తీసుకున్నాడు. తిరిగి వాటిని ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. ఈ నేపథ్యంలో ఆమె ఇంట్లో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన ఉమాదేవి ఈ నెల 16వ తేదీన తన పుట్టింటికి వచ్చి.. అర్ధరాత్రి దాటాక చీరతో సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక మృతి


శ్రీనివాసరావు (పాతచిత్రం)

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు(56) గురువారం ఉదయం గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన్ను చేర్పించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఉదయం 6.30 గంటలకు స్టంట్ వేసేందుకు ఏర్పాట్లు చేయగా.. 6.45 గంటలకు మరోసారి గుండెపోటు రావడంతో మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరూ ఎంబీబీఎస్ డాక్టర్లు. డీపీఓ మృతదేహాన్ని ఆయన స్వస్థలం విశాఖపట్నం తీసుకువెళ్లారు. శ్రీనివాసరావు గతనెల 30న తూర్పుగోదావరి డీపీఓగా బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం సమగ్రశిక్ష అదనపు సమన్వయకర్తగా పనిచేస్తూ ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చారు. 1999లో ముమ్మిడివరం ఎంపీడీవోగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. అనంతరం పెద్దాపురం ఎంపీడీవోగా, విశాఖపట్నంలో జిల్లా పరిషత్ అకౌంట్స్ అధికారిగా, డిప్యూటీ సీఈవోగా, డ్వామా పీడీగా విశాఖపట్నంలో విధులు నిర్వహించారు. డీపీఓ శ్రీనివాసరావు మృతి పట్ల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, డీఆర్వో నరసింహులు సంతాపం తెలిపారు. వీరితో పాటు, ఇతర జిల్లాస్థాయి అధికారులు ఆసుపత్రికి వెళ్లి డీపీఓ కుటుంబ సభ్యుల పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సభ్యురాలిగా మాధవి



ఎం.వి.పి. కాలనీ, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సభ్యురాలిగా స్వచ్ఛంద సంస్థల నుంచి ఆర్.మాధవి గణపతి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మాధవి గణపతి వాసవ్య మహిళా మండలి కార్యనిర్వాహక సభ్యురాలిగా, మహిళా పోలీసుస్టేషన్, కేంద్ర కారాగారంలో సైకో సోషల్ కౌన్సెలర్‌గా, ఉమెన్ ఇన్ నీడ్ (విన్) ఫోరంలో కౌన్సిలర్‌గా సేవలందించారు. కమిటీ సభ్యురాలిగా ఆమె రెండేళ్ల పాటు సేవలందించనున్నారు.

విశ్రాంత తహసీల్దార్ సుధాకర్‌నాయుడు మృతి


సుధాకర్‌నాయుడు (పాతచిత్రం)

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ సేవల సంఘం మాజీ నాయకులు లాలం సుధాకర్‌నాయుడు (65) గురువారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కలెక్టరేట్ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఆయన ఉద్యోగ విరమణ తర్వాత విశాలాక్షినగర్‌లో నివసిస్తున్నారు. 1984లో జూనియర్ సహాయకుడిగా రెవెన్యూశాఖలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఏపీ ఆర్ఎస్ఏ నగర కమిటీ కార్యదర్శి, హౌస్‌బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు. సీతమ్మధార, విశాఖ రూరల్, పెందుర్తి మండల తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల సమయంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కొంతకాలం విధులు నిర్వహించారు. తెదేపా సీనియర్ నేత లాలం భాస్కరరావుకు స్వయనా తమ్ముడు. సంఘం నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, సిహెచ్.వి.రమేష్, ఎం.మధుసూదనరావు, కేవీ ఈశ్వరరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు సుధాకర్‌నాయుడికి నివాళి అర్పించారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.


లాలం సుధాకర్‌నాయుడు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఏపీఆర్ఎస్ఏ జిల్లా కమిటీ నాయకులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

పెందుర్తి

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప క్రీడలు: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నీలో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కడప వైఎస్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నానికి మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు నిర్ణీత 39 ఓవర్లలో 234/5 స్కోరు చేసింది. రామ్‌చరణ్ 80, వినోద్ 52, తమనారెడ్డి 51 పరుగులు చేయగా, సాయికృష్ణచైతన్య 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 98/4 స్కోరు చేసింది.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

అక్కిరెడ్డిపాలెం: మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ అయిన ఘటనపై గురువారం బాధితులు తెలిపిన వివరాలివి. నాతయ్యపాలెంలోని చివరి వీధిలో గేదెల దుర్గారావు, పైడమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం 6 గంటల సమయంలో పైడమ్మ ఇంటి ఎదుట పువ్వులు కోస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఏదో చిరునామా వివరాలు అడిగారు. ఆమె సమాధానం చెప్పేలోపే.. మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కెళ్లిపోయారు. సమాచారం అందుకున్న గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవీ ఇవీ

పీఏసీఎస్ సభ్యులకు ఈ-కేవైసీ తప్పనిసరి

సబ్బవరం: శ్రీరాంపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో (పీఏసీఎస్) సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి గొంప రమణ తెలిపారు. లేని పక్షంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దక్కవన్నారు. ప్రస్తుతం ఈ సంఘంలో సభ్యుల వివరాలను డిజిటలీకరణ జరుగుతుందన్నారు. కాబట్టి పూర్తి వివరాలతో పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అనేక మాధ్యమాల ద్వారా సభ్యులకు అవగాహన కల్పించినప్పటికీ ఇంతవరకు 40 శాతం సభ్యులు మాత్రమే నమోదు చేయించుకున్నారని తెలిపారు. మిగిలినవారు ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. సభ్యులు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకం లేదా 1బి లేదా భూమి పత్రాల నకళ్లతో పాటు ఆధార్, రేషన్ కార్డు, పాన్‌కార్డు, నామినీ పేరు తదితర వివరాలకు చెందిన జెరాక్సు కాపీలను కార్యాలయంలో అందించాలని వివరించారు.

లైసెన్సు లేకుండా తరలిస్తున్న బాణసంచా స్వాధీనం

పెందుర్తి, న్యూస్‌టుడే: దీపావళి పండగను పురస్కరించుకుని ముందుగానే బాణసంచా కొనుగోలు చేసి నిల్వ చేయడానికి చేసిన ప్రయత్నాన్ని పెందుర్తి పోలీసులు భగ్నం చేశారు. పెందుర్తి కూడలి వద్ద వాహన తనిఖీల్లో భాగంగా విక్రయాలకు లైసెన్సు లేకుండా బాణసంచా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. విజయనగరం నుంచి ముగ్గురు యువకులు సుమారు రూ.50 వేలు విలువైన బాణసంచా సామగ్రిని పెందుర్తి తీసుకువస్తుండగా తనిఖీ చేసి సరుకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సరుకు తరలింపులో సైతం నిబంధనలు పాటించని నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: సిరులతల్లి సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

వాల్మీకి మహర్షి జయంతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం కూడలిలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పరవాడ బండు దుర్గాప్రసాద్ వెన్నెల అప్పలనాయుడు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పైల తాతబాబు, మజ్జి నాయుడు, దూంగ అప్పనాయుడు, బుజ్జి, నారాయణరావు, అప్పలనాయుడు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అప్పలనాయుడు తదితరులు

రహదారులు మాయం.. ఒళ్లంతా హూనం..


పరవాడ మండల పరిషత్తు కూడలిలో దెబ్బతిన్న రహదారి

పరవాడ, న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో అంతులేని అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పరవాడ మండలంలోని వివిధ రహదారులు శిథిలావస్థకు చేరాయి. ఎక్కడికక్కడ గుంతలతో ప్రయాణం నరకం చూపిస్తోంది. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఫలితంగా రోడ్డేదో.. గుంత ఏదో తెలియక వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రహదారులను బాగు చేయాలని గత ఐదేళ్ల కాలంలో వైకాపా నాయకులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రహదారులకు ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. దీంతో అవస్థలు పడుతూ ప్రయాణం సాగించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారులను గాలికొదిలేశారు. పరవాడ మండల పరిషత్తు కూడలి, పరవాడ సబ్‌స్టేషన్ కూడలి, వెన్నెలపాలెం నుంచి ఎన్టీపీసీకి వెళ్లే రహదారి, ఈ.భోనంగి తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద, జాజులవానిపాలెం నుంచి కలపాక మార్గం, వాడచీపురుపల్లి - వెంకటాపురం రహదారి, మెట్టపాలెం - పాతరాజానపాలెం, బొట్టవానిపాలెం - రేబాకనిపాలెం దారిలో గుంతలు పడడంతో పాటు వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒళ్లంతా హూనం కావడంతో పాటు తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


బొట్టవానిపాలెం నుంచి రేబాకనిపాలెం వెళ్లే మార్గంలో ఇలా..


ఈ.భోనంగి తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద భారీ గుంత

గ్రామ రెవెన్యూ సదస్సులకు ఆదరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: విప్పాక అగ్రహారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ సదస్సుకు ఆదరణ పెరిగింది. ఇటీవల కాలంలో రీసర్వే జరిగినప్పుడు అనేక తప్పులు దొర్లాయి. వీటిని సవరించుకునేందుకు రైతులు వరుసకు కట్టారు. దరఖాస్తులు ఇచ్చి తమ భూములకు సరైన రికార్డులు ఇవ్వాలని తహసీల్దారు బి.చిన్నికృష్ణను కోరారు. ఈ రెవెన్యూ గ్రామంలో పట్టా భూమి 75.95 ఎకరాలు ఉండగా రీసర్వే అనంతరం 76.26 ఎకరాలు నమోదైంది. మొత్తం ప్రభుత్వ భూమి 13.89 ఎకరాలు ఉండగా 13.50 ఎకరాలుగా గుర్తించడం జరిగిందని తహసీల్దారు తెలిపారు. అదే విధంగా 16 సర్వే నెంబర్లు ఉండగా 265 మందికి ఎల్‌పీఎంలు ఇవ్వాలని ఆయన వెల్లడించారు. ఈ సమావేశానికి సర్పంచి మోహన ఆధ్వర్యంలో అర్జీలు తమ రికార్డుల్లో తప్పులు సవరించుకోవాలని ఏదు గురు దరఖాస్తులు చేసుకున్నారు.


విప్పాక అగ్రహారం సదస్సులో పాల్గొన్న అధికారులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం సామాజిక భవనం వద్ద గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. జిల్లా సర్వే అధికారిణి మనీషాపాత్రో, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు తదితరులు హాజరై మాట్లాడారు. రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీసర్వేలో ఏమైనా తప్పులు పడినా, హద్దులు, కొలతల్లో తేడా వచ్చినా, ఎవరి భూమి అయినా సర్వే చేయకపోయినా, ఎటువంటి భూ సమస్యలున్నా అర్జీలు పెట్టుకోవాలన్నారు. మండల సర్వేయర్ శ్రీనివాస్ ఇంతకు ముందు జరిగిన రీసర్వే గురించి వివరించారు. అనంతరం ప్రజల నుంచి రెవెన్యూ సిబ్బంది వినతులు స్వీకరించారు. మొత్తం 31 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, సర్పంచి కన్నూరు దేవి, మండల సర్వేయర్ శ్రీనివాస్, రీసర్వే డీటీ సురేశ్, వీఆర్వో భుజంగరావు, స్థానిక నాయకులు కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ పాల్గొన్నారు.


తానాంలో మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారిణి మనీషాపాత్రో

విద్యార్థులకు వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రదీప్‌ప్రసాదురాజా

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, పిట్టవానిపాలెం మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్‌ప్రసాదురాజా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధుల నిమిత్తం స్క్రీనింగ్ చేశారు. తలలు చేతులు, వ్యక్తిగత శుభ్రత, సురక్షిత తాగునీరు, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది గోపాలం, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఆధ్వర్యంలో తహసీల్దారు బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటు వజ్రాయుధంలా పని చేస్తుందన్నారు. యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దారు చిన్నికృష్ణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదుకు ఫారం-6ను నింపి ఇవ్వాలన్నారు. ఈ దరఖాస్తు ఫారాలు ఉచితంగా ఇస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకునే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అర్జునరావు, ఉప ప్రిన్సిపల్ బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉప ప్రిన్సిపల్ శంకర్

మ్యాన్‌హోళ్ల పూడిక తొలగింపు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ ఒకటో లేఅవుట్‌లో పూడుకుపోయిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ మ్యాన్‌హోళ్లను యూజీడీ సిబ్బంది గురువారం శుభ్రం చేశారు. మురుగు పొంగిపొర్లుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆమె అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.


శ్రమశక్తినగర్‌లో..

పల్లెల సర్వతోముఖాభివృద్ధికి కృషి


జంగాలపాలెంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల, అధికారులు, నాయకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు కృషి చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా గురువారం పెందుర్తి మండల పరిధిలోని సరిపల్లి, జంగాలపాలెం, రాజయ్యపేట, పెదగాడి, చింతలగ్రహారం పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. జనవరి నాటికి పనులన్నీ పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులను ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, పీఆర్ డీఈ రమణమూర్తి, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారంలో పల్లెపండుగ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సర్పంచి దాడి గోపీఅప్పలనాయుడు పంచాయతీకి కేటాయించిన రూ.14 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాడి వరలక్ష్మి, మాజీ ఎంపీపీ కాళ్లవరలక్ష్మి, మాజీ సర్పంచులు పి.వెంకటరమణ, పి.అప్పారావు, మాజీ ఉపసర్పంచి ఎస్.భీమేశ్వరరావు, జనసేన నాయకులు కె.సంతోష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భారీ వర్షం కారణంగా ఎమ్మెల్యే హాజరుకాలేక పోతున్నారని సర్పంచి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసేయాలని సూచించడంతో కూటమి నాయకులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు.


చింతలగ్రహారంలో సర్పంచి దాడి గోపీఅప్పలనాయుడు తదితరులు

భారీ వర్షంతో పర్యటనలు రద్దు

భారీవర్షం కారణంగా పల్లెపండుగ కార్యక్రమాలు చింతగట్ల, జెర్రిపోతులపాలెంలలో గురువారం రద్దయ్యాయి. వీలును బట్టి మళ్లీ కార్యక్రమాలు జరుపుతామని లేదంటే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే వస్తారని ఆయా గ్రామ పెద్దలకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

విశ్వకర్మ యోజనతో ఆర్థిక స్వావలంబన

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వెలుగు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గురువారం పెందుర్తి కూడలిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో విశ్వకర్మ యోజనపై అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ కులవృత్తులు చేసుకునే పేదలకు అండగా ఉండాలన్న సంకల్పంతో ఈ పథకం ప్రవేశపెట్టారన్నారు. విశాఖ జిల్లాలో 58 వేల మంది దరఖాస్తు చేసుకోగా 7,091 మంది మాత్రమే అర్హులుగా ఎంపికయ్యారన్నారు. పథకంపై అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో వెలుగు, డీఆర్‌డీఏ అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జోన్-8 జెడ్సీ హేమావతి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ సత్యంనాయుడు, పెందుర్తి భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు, అధికారులు, నాయకులు


అవగాహన సదస్సులో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

భక్తి శ్రద్ధలతో గౌరమ్మ తల్లికి పూజలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలో గౌరమ్మతల్లి ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు గౌరమ్మను మేళతాళాలతో బాణసంచా కాల్పుల నడుమ భారీగా ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠా స్థలికి తీసుకొచ్చి గౌరమ్మను ప్రతిష్ఠించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు నేతలు గండి రవికుమార్, సిరపరపు వాసు, ఇండుగుబిల్లి దేముడు, కనకరాజు దేముడు, సత్యనారాయణ, బంగారయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.


గౌరమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు


చింతలగ్రహారం వరి దుబ్బులకు పూజలు చేస్తున్న దృశ్యం

చింతలగ్రహారం (వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాలయంలో గురువారం గౌరీపూర్ణిమ పూజలు ఘనంగా జరిగాయి. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేకంగా వరి దుబ్బులను గౌరీపరమేశ్వరులుగా తీర్చిదిద్ది పూజలు చేశారు. కార్తిక పౌర్ణమి వరకు రోజూ గౌరీపరమేశ్వరులకు ఆరాధన, విశేష హారతి జరుగుతుందని ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు తెలిపారు.

వేడుకగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం దరి సింహాచలం ఆర్టీసీ డిపోలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దసరా రోజున అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆర్టీసీ మహిళా కండక్టర్లు, కార్యాలయంలోని మహిళలు, తదితరులు అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. శనివారం దీపారాధన, ఆదివారం అమ్మవారి నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురం రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో ఈనెల 3 నుంచి ప్రారంభమైన దసరా బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 28 కలశాల పుణ్య జలాలతో రాజరాజేశ్వరీ అమ్మవారికి పూర్ణ కుంభాభిషేకం, పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. జ్ఞానేశ్వరీ మాతకు సైతం కలశ పంచామృతాభిషేకం చేశారు. అనంతరం లలితా సహస్రనామావళి పఠనం జరిగింది. సాయంత్రం చంద్రోదయ సమయంలో శ్రీమేరు చెంతనున్న కొలనులో చంద్రబింబాన్ని తిలకించారు. అనంతరం సిరి జ్యోతి పూజ నిర్వహించి జలహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అమ్మవారి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.


కామేశ్వరీ దేవికి కలశ స్నానం చేయిస్తున్న భక్తులు


ఆర్టీసీ డిపోలో కుంకుమ పూజల్లో మహిళలు

పెందుర్తి గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

పెందుర్తి, న్యూస్‌టుడే: సుజాతనగర్ దరి లక్ష్మీనరసయ్యమ్మ కాలనీకి చెందిన బలివాడ కృష్ణప్రియ, శ్రీనివాసరావు, యశ్వంత్ పెందుర్తి శాఖా గ్రంథాలయానికి భారీ ఎత్తున పుస్తకాలు బహూకరించారు. గురువారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో నవలలు, సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన సుమారు 500 పైగా పుస్తకాలను గ్రంథాలయాధికారిణి బి. సూర్యకళకు అందజేశారు. ఇదే స్ఫూర్తిగా మరింత మంది ముందుకొచ్చి గ్రంథాలయానికి పుస్తకాలు సమకూర్చాలని సూర్యకళ కోరారు.


గ్రంథాలయ సిబ్బందికి పుస్తకాలు అందిస్తున్న దాతలు



యూబీఏ ఆడిట్‌లో పాల్గొన్న ఏయూ ప్రాంతీయ సమన్వయకర్త పావని, అధ్యాపకులు, విద్యార్థులు

గ్రామాలభివృద్ధికి విద్యార్థుల కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామాలభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని ఈ పథకానికి సంబంధించిన ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ బి.పావని సూచించారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉన్నత భారత్ అభియాన్ (యూబీఏ) అకడమిక్ ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో పావని పలు అంశాలపై చర్చించారు. అయిదు గ్రామాలను దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు విద్యార్థులు కృషి చేస్తున్నారని కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎంఎస్‌వీకే బాలాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలపై ఆరోపణలు రావడంతో సంబంధిత హాజరు పట్టికను పరిశీలించారు. అందిస్తున్న సేవలు ప్రధాన వైద్యుడు ఎస్ఎన్ఆర్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన గొట్టివాడలోని విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలాజీ

మేమున్నాం.. మీకు తోడుగా

పెందుర్తి : 90598 98721
వేపగుంట: 93472 79909
10 AM - 1 PM

పరవాడ, న్యూస్‌టుడే

సమస్య: పరవాడ మండలం గొర్లెవాణిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చెత్తకుప్పలు పెరిగిపోయాయి.
– రమణ, స్థానికుడు

సమాధానం: త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వ్యర్థాలను తొలగిస్తాం.
– ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

పెందుర్తి, న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో పెందుర్తిలో బుధవారం రాత్రి నుంచి భారీవర్షం కురిసింది. విడతలు విడతలుగా పెద్దఎత్తున కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పెందుర్తి కూడలిలో బీఆర్టీఎస్ రహదారిలో నీరు నిలిచిపోయి వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. పలు కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.


పరవాడలో..


భరణికం మొల్లోడు గెడ్డవాగులోకి చేరిన నీరు

పరవాడ, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా పరవాడ మండలంలో జోరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై విస్తారంగా వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మొల్లోడుగెడ్డవాగుతో పాటు పరవాడ చెరువుల్లో నీరు చేరింది. పెద్దచెరువు నీటితో నిండి కళింగు పైనుంచి నీరు పారుతోంది. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, అప్పికొండ తీరాలకు చెందిన మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. వర్షానికి పొలాల్లో సరుగుడు, యూకలిప్టస్ మొక్కలు నాటే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.


పెందుర్తి కూడలిలో నిలిచిన నీరు


విశాఖ - పెందుర్తి రోడ్డులో వరద

భారతమాతాకు జైకొడుతూ..

జాతీయ పతాకానికి సెల్యూట్ చేయండి

పాక్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిలిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశం

భోపాల్: పొరుగుదేశం పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు షరతులు విధించింది. నిందితుడిలో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కేసు విచారణ ముగిసే వరకు ప్రతినెలా పోలీస్ స్టేషన్‌లోని జాతీయ జెండాకు సెల్యూట్ చేయాలని, ఆ సందర్భంగా 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేయాలని జస్టిస్ డి.కె.పలివాల్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.



భోపాల్‌లోని మిస్రోద్ పోలీస్ స్టేషన్ పరిధి నివాసి ఫైజల్ అలియాస్ ఫైజాన్ ఈ ఏడాది మే నెలలో పాక్ అనుకూల నినాదాలు చేశారంటూ పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌ను అగౌరవపరుస్తూ, సమాజంలోని వివిధ వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించారంటూ అభియోగాలను మోపారు. విచారణ సందర్భంగా రూ.50వేల పూచీకత్తుపై ఫైజాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఫైజాన్ ప్రతినెలా తొలి, నాలుగో మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని ఆదేశించింది. అలా వెళ్లిన ప్రతిసారీ జాతీయ జెండాకు 21 సార్లు సెల్యూట్ చేయాలని, భారత్ మాతాకీ జై అని రెండుసార్లు నినదించాలని తెలిపింది.

పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6(ఎ) రాజ్యాంగబద్ధమే

- అస్సాం వలసలకు సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు



దిల్లీ: అస్సాం వలసలకు సంబంధించి ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 4-1 మెజారిటీతో గురువారం కీలక తీర్పును వెలువరించింది. భారత పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6(ఎ)కు రాజ్యాంగబద్ధత ఉందని స్పష్టం చేసింది. సెక్షన్ 6(ఎ) ప్రకారం.. జనవరి 1, 1966 - మార్చి 25, 1971 మధ్య అస్సాంలోకి ప్రవేశించిన వలసదారులు భారత పౌరసత్వానికి అర్హులు. బంగ్లాదేశ్ వలసలతో అస్సాంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను చల్లార్చడానికి 1985లో ఓ ఒప్పందం జరిగింది. దీనిపై కేంద్రం తరఫున నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ.. ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) ప్రతినిధులు సంతకం చేశారు. ఈ ఒప్పందం ఆధారంగా పౌరసత్వ చట్టానికి సవరణ చేసి సెక్షన్ 6(ఎ)ను చేర్చారు. కేవలం అస్సాం రాష్ట్రానికి మాత్రమే వర్తించేలా చేసిన ఈ సవరణ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ పీఠికలోని సౌభ్రాతృత్వ భావనకు వ్యతిరేకమని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం తిరస్కరించింది. అయితే ధర్మాసనంలోని జస్టిస్ జె.బి.పార్దీవాలా మాత్రం సెక్షన్ 6(ఎ) ఏకపక్షంగా ఉందని, రాజ్యాంగపరంగా చెల్లుబాటు కాదంటూ మైనారిటీ తీర్పును వెలువరించారు. ఈ సందర్భంగా సీజేఐ "అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం ఓ రాజకీయ పరిష్కారం. అదే సమయంలో సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గం. ఈ నిబంధనలు రూపొందించడానికి మెజార్టీతో కూడిన పార్లమెంటుకు శక్తి ఉంది. మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు.. స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతుల్యత ఈ సెక్షన్‌కు ఉంది. ఇక దీనిలోని కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదే. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసింది. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని ఇది చెబుతోంది. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదు.. మరీ తక్కువగానూ విలీనం చేసుకోలేదు" అని పేర్కొన్నారు. అక్రమ వలసలు అరికట్టేందుకు ఇంకా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కేవలం అస్సాంకే ఈ నిబంధన పరిమితం చేయడాన్ని కూడా సీజేఐ సమర్థించారు. మిగతా రాష్ట్రాల కంటే అస్సాం ఎక్కువగా వలసలతో ప్రభావితమవుతుందని.. కాబట్టి ఇందులో హేతుబద్ధత ఉందని తెలిపారు.

హరియాణా సీఎంగా సైనీ ప్రమాణం

- హాజరైన మోదీ, అమిత్ షా, చంద్రబాబు, ఎన్డీయే నేతలు



సీఎంగా ప్రమాణం చేసిన సైనీకి మోదీ ఆశీస్సులు. చిత్రంలో గవర్నర్ దత్తాత్రేయ

చండీగఢ్: హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం పంచకులలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్డీయే నేతలు, భారీ జన సందోహం మధ్య ప్రమాణం చేశారు. ఆయనతో గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణం చేయించారు. దసరా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. సైనీతోపాటు 13 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. గురువారం వాల్మీకి జయంతి కావడం విశేషం. ప్రమాణం అనంతరం సైనీకి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. 54ఏళ్ల సైనీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గత మార్చిలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను మార్చి ఆయనను భాజపా అధిష్ఠానం సీఎంను చేసింది. ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో విజయం సాధించడంతో మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మంత్రులుగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ విజ్, అహిర్ వర్గం నేత రావ్ నర్బీర్ సింగ్, జాట్ నేత మహిపాల్ దండా, భాజపాలో చేరిన కాంగ్రెస్ నేత శ్రుతి చౌదరి, తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆర్తి సింగ్ తదితరులున్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరైన వారిలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వ శర్మ, విష్ణుదేవ్ సాయ్, భూపేంద్ర పటేల్, పుష్కర్ సింగ్ ధామి తదితరులు హాజరయ్యారు.

ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవాలన్న పిటిషనరుపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: హరియాణా ముఖ్యమంత్రిగా సైనీ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవాలని కోరిన పిటిషనరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇదేమి పిటిషన్.. దీనిని డిస్మిస్ చేస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. హరియాణా ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈవీఎంలలో లోటుపాట్లు చోటుచేసుకున్నాయని పిటిషనరు తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకారాన్ని ఎలా అడ్డుకోగలమని ప్రశ్నించింది.

బాంబు బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలే

- కేంద్ర మంత్రి రామ్మోహన్ స్పష్టీకరణ

దిల్లీ: జాతీయ, అంతర్జాతీయ విమానాలకు కొద్ది రోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులను నియంత్రించేందుకు కేంద్రం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న విమానయాన భద్రత చట్టాలను సవరించే యోచనలో ఉన్నట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తుత్తి బెదిరింపు కాల్స్‌లను తీవ్రంగా పరిగణిస్తున్నామని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరుస బాంబు బెదిరింపుల వెనుక కుట్ర దాగి ఉందా అన్న ప్రశ్నకు.. 'ప్రస్తుతం వచ్చినవన్నీ వ్యక్తులు, మైనర్లకు సంబంధించిన బెదిరింపులే' అని తెలిపారు. బాంబు బెదిరింపులకు పాల్పడిన వారిపై విమానయాన నిషేధం విధించే ఆలోచన ఉందని వివరించారు.

★ ముంబయి-లండన్ ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ముందు జాగ్రత్త చర్యగా రాయల్ ఎయిర్ ఫోర్స్ టైఫూన్ ఫైటర్ జెట్ రంగంలోకి దిగింది. గురువారం మధ్యాహ్నం దానిని పంపినట్లు ఆ సంస్థ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆ తర్వాత ఎయిరిండియా విమానం లండన్‌లో సురక్షితంగా దిగింది.

ఝార్ఖండ్ తొలి విడతకు నేటి నుంచి నామినేషన్లు

రాంచీ, చండీగఢ్: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానుంది. 43 నియోజకవర్గాలకు నవంబరు 13న జరిగే పోలింగ్ కోసం ఈ నెల 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల మధ్య నామినేషన్ల దాఖలును అనుమతిస్తారు. ఈ నెల 30లోగా నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

★ హరియాణా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ పార్టీని వీడారు. ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ పదవికి ఆయన రాజీనామా చేశారు.

ఆసియా పసిఫిక్ ఏబీసీ ఛైర్మన్‌గా మసానీ



దిల్లీ: భారత ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) సెక్రటరీ జనరల్ హోర్మజ్ మసానీ.. ఆసియా పసిఫిక్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్క్యులేషన్ (ఏపీఏబీసీ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిని చేపట్టడం ఐదోసారి. ఈ మేరకు ఏబీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఐఎఫ్ఏబీసీ) సర్వసభ్య సమావేశంలో మసానీ ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ (గౌరవ కోశాధికారి)గా కూడా వరుసగా తొమ్మిదోసారి ఎన్నికయ్యారు. ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డులో భారత్‌తోపాటు, ఆస్ట్రియా, బ్రెజిల్, ఫ్రాన్స్, జర్మనీ, రొమేనియా, స్పెయిన్, బ్రిటన్, అమెరికా దేశాల బ్యూరోల ప్రతినిధులు ఉన్నారు. 2008 నుంచి ఏపీఏబీసీ కార్యనిర్వాహక మండలిలో ఏబీసీ-ఇండియాకు మసానీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



ఈ నాలుగింటితో పరిపూర్ణ ఆనందం

జీవితంలో నాలుగు అంశాలుంటేనే పరిపూర్ణమైన ఆనందాన్ని పొందగలం. అవేంటంటే.. 1.జీవితానికి ఓ పరమార్థం ఉండేలా చూసుకోవడం. 2.ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆశావహ దృక్పథంతో ఉండటం. 3.ప్రకృతితో అనుసంధానమై జీవించడం. 4.ప్రేమపూర్వక బంధాలను కలిగి ఉండటం. ఇవి లేకపోతే ఎంత సంపద ఉన్నా, ఎన్ని సౌకర్యాలు ఉన్నా జీవితంలో వెలితి ఉంటుంది.

– డేనియల్ ఆరోన్, లైఫ్ కోచ్

భర్త ఆగ్రాలో.. భార్య దిల్లీలో ఆత్మహత్య

- ఇద్దరూ.. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ అధికారులు
- విషాదంగా ముగిసిన ప్రేమపెళ్లి

దిల్లీ: భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఓ జంట ఒకరోజు వెనుకాముందు వేర్వేరు నగరాల్లో ఆత్మహత్యకు పాల్పడింది. వీరిద్దరిది ప్రేమపెళ్లి కావడం గమనార్హం. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీలలో విధులు నిర్వహిస్తున్న వీరి విషాదాంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీన దయాళ్ దీప్ (32) ఆగ్రాలో ఐఏఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంటుగా పనిచేస్తున్నారు. అక్కడే సైనిక ఆసుపత్రిలో ఆయన భార్య రేణు తన్వర్ ఆర్మీ కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 14న (సోమవారం) తన తల్లికి వైద్యచికిత్స కోసం తన్వర్ దిల్లీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదేరోజు రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీన్‌దయాళ్.. మంగళవారం ఉదయం బయటకు రాకపోవడంతో సహోద్యోగులు క్వార్టర్స్ తలుపు పగలగొట్టి చూడగా ఉరి వేసుకుని కనిపించారు. మరోవైపు.. తన్వర్ కూడా దిల్లీ కంటోన్మెంట్‌లోని అధికారుల నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం ఆమె దిల్లీ ఎయిమ్స్‌లో ఉండగా భర్త మరణం గురించి తెలిసి షాక్‌కు గురయ్యారని, ఆ తర్వాత అతితీవ్రమైన నిర్ణయం తీసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రేణు తన్వర్ బలవన్మరణానికి పాల్పడినట్లు దిల్లీ డీసీపీ సురేంద్రకుమార్ చౌదరి ధ్రువీకరించారు. పోలీసులు తన్వర్ మృతదేహం పక్కన లేఖను స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ కారణం కాదని పేర్కొన్న ఆమె.. భర్త మృతదేహంతో కలిపి అంతిమ సంస్కారాలు చేయాలని అందులో కోరారు.

హసీనాపై అరెస్టు వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సహా ఆమె పార్టీ అవామీ లీగ్‌కు చెందిన అగ్ర నాయకులు 45 మందిపై అరెస్టు వారెంట్ జారీ అయింది. నవంబరు 18లోగా వారందరినీ తమ ఎదుట హాజరుపరచాలని దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) ఛైర్మన్ జస్టిస్ మహ్మద్ గోలం మొర్తుజా మజుందార్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, హత్యలు, ఇతర నేరాల ఆరోపణలపై హసీనా, ఆమె పార్టీ నేతలు, 14 పార్టీల మిత్రపక్ష నేతలకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

హవాలా కేసులో తమన్నాను విచారించిన ఈడీ



గువాహటి: నగదు అక్రమ చలామణీ (మనీ లాండరింగ్) కేసులో సినీనటి తమన్నా భాటియాను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారించారు. బిట్‌కాయిన్లు, ఇతర క్రిప్టోకరెన్సీల మైనింగ్ పేరిట పలువురిని మోసగించిన వ్యవహారంలో 'హెచ్‌పీజడ్ టోకెన్' మొబైల్ యాప్ పాత్ర ఉంది. ఈ కేసులో వెలుగులోకి వచ్చిన మనీలాండరింగ్ ఆరోపణలపై తమన్నా వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు ఈడీ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. యాప్ కంపెనీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తమన్నా కొంత సొమ్ము తీసుకున్నారని, అయితే ఆమెపై ఎటువంటి నేరారోపణ అభియోగాలు మోపలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

నాడీ వ్యాధులకు అందుబాటులో ఆధునిక వైద్యం



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, చిత్రంలో డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ ఎస్.గోపి, డాక్టర్ దేబాశిష్ చౌధరి, డాక్టర్ సత్యవరప్రసాద్ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నాడీ వ్యాధులకు మెరుగైన చికిత్స అందించి బాధితులకు స్వస్థత చేకూర్చాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (ఐఏఎన్) జాతీయ సదస్సు-31ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈనెల 20 వరకు జరగనున్న ఈ జాతీయ సదస్సుకు దేశం నలుమూలల నుంచి పలువురు వైద్య ప్రముఖులు హాజరయ్యారు. విదేశాల నుంచి పలువురు న్యూరాలజీ వైద్య నిపుణులు హాజరై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విధానాలను బాధితుల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ఐఏఎన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేబాశిష్ చౌధరి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ మీనాక్షి సుందరం, నిర్వాహక కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి, విశ్రాంత ప్రొఫెసర్లు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.సత్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూరాలజీ రంగంలో ప్రముఖంగా సేవలందించిన వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

★ ఉదయం నుంచి సాయంత్రం వరకు న్యూరాలజీ వైద్య రంగంపై నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు (సీఎంఈ) జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ప్రముఖ న్యూరో ఫిజీషియన్లు డాక్టర్ దిలీప్ యుగల్ (అమెరికా), డాక్టర్ అశోక్ (యూకే), డాక్టర్ ఫ్రైడ్‌మన్ (అమెరికా) తదితరులు పాల్గొని చిత్త వైకల్యం, పునరావాస కేంద్రాలు, అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య విధానాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా రూపొందించిన గోడపత్రికలను అతిథులు విడుదల చేశారు.

23 నుంచి పోర్టు స్టేడియంలో వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: యువతలో స్నేహభావాన్ని పెంపొందించడానికి క్రీడలు దోహదపడతాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ కుమార్ అన్నారు. బీచ్‌రోడ్డు పామ్‌బీచ్ హోటల్లో గురువారం ఉదయం వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (వి.ఎస్.పి.ఎల్) క్రికెట్ క్రీడాకారుల వేలం నిర్వహించారు. ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన క్రికెట్ క్రీడాకారులు వేలంలో పాల్గొన్నారు. 8 జట్లకోసం 225 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ఛైర్మన్ బైబిల్ ప్రసాద్ మాట్లాడుతూ 23 నుంచి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు పోర్టు స్టేడియంలో క్రికెట్ పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో మొదటి స్థానం విజేతలకు రూ.5 లక్షలు, రన్నర్స్‌కు రూ.3 లక్షలు, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారుడికి రూ.50 వేలు అందజేయనున్నామని చెప్పారు. వి.ఎస్.పి.ఎల్ వైస్ ఛైర్మన్ రాజేష్, అధ్యక్షులు నక్కా శ్రీధర్, ఉపాధ్యక్షులు అక్రమాని లోవరాజు, పృధ్వి, కమిటీ సభ్యులు సురేష్, సునీల్‌కుమార్, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వరద బాధితులకు రూ. 2లక్షల విరాళం

గురుద్వారా, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీతమ్మధార లాన్సమ్ ఆక్సిజన్ టవర్స్ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి రూ.2లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. గురువారం భాజపా కార్యాలయంలో ఎమ్మెల్యేకు ఆ చెక్కును ఇచ్చారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు విరాళం చెక్కు అందజేస్తున్న దృశ్యం

పోటీ లేకుండా చెయ్ నచ్చిన గుత్తేదారుకు ఇచ్చెయ్..!

- రాసా సంస్థకు అనుకూలంగా నిబంధనలు
- రూ.10కోట్ల సీసీఎస్ ప్రాజెక్టు టెండరులో మాయ

టెండరులో మాయ చేసి తమకు నచ్చిన గుత్తేదారుకు పనులు అప్పగించడానికి మహా విశాఖ నగరపాలక సంస్థ మెకానికల్ విభాగం అధికారులు సిద్ధమవుతున్నారు. పోటీ లేకుండా చేయడానికి పలు నిబంధనలు తెరపైకి తెస్తున్నారు. ఫలితంగా జీవీఎంసీకి నష్టం వస్తుండగా, గుత్తేదారు జేబులు నిండుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

కార్పొరేషన్, న్యూస్‌టుడే



జీవీఎంసీ క్లోజ్డ్ కాంపాక్షన్ వాహనాలు

ఏడాది పాటు సీసీఎస్(క్లోజ్డ్ కంపాక్షన్ సిస్టం) ద్వారా చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించడానికి త్వరలో జీవీఎంసీ టెండరు ఆహ్వానించనుంది. ఇప్పటికే మెకానికల్ విభాగ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కౌన్సెల్ లేదా స్థాయీ సంఘంలో అనుమతులు పొందడానికి తెర వెనుక ప్రయత్నాలు ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఒక సంస్థ మాత్రమే ఈ టెండరును దక్కించుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై కూటమి కార్పొరేటర్లు దృష్టి పెట్టాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గుత్తేదారుకు అనుకూలంగా నిబంధనలు: ఘనవ్యర్థాల నిర్వహణ-2016లో భాగంగా జీవీఎంసీ 2018లో సీసీఎస్ ప్రాజెక్టును అమలులోకి తెచ్చింది. ఈ విధానంలో చెత్త తరలింపు కేంద్రాల నుంచి చెత్తను కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు సీసీఎస్ (క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం) ద్వారా తరలిస్తున్నారు. సాధారణంగా జీవీఎంసీలో పనులు చేస్తున్న గుత్తేదారులు ఈ ప్రాజెక్టుకు పోటీ పడడానికి అవకాశం కల్పించాలి. ప్రస్తుత టెండరు ధరను తీసుకుంటే అందులో 50 శాతం విలువైన పనిని గతంలో చేసిన వారు అర్హులనే నిబంధన ఉండాలి. కాని 10 టైర్ వాహనాలు నడిపిన అనుభవం, ఒక ఏడాదిలో 42వేల టన్నుల చెత్తను తరలించిన గుత్తేదారులు మాత్రమే అర్హులని నిబంధనలు పెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ అనుభవం కేవలం రాసా సంస్థకు తప్ప రాష్ట్రంలో మరే గుత్తేదారుకు లేదు. దీంతో ఈ ఏడాది కూడా చెత్త తరలింపు టెండరు ఆ సంస్థకే దక్కే అవకాశం ఉంది.

ఏడాదికి రూ.10కోట్ల వ్యయం

నగర పరిధిలో జీవీఎంసీకి నాలుగు సీసీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒక్కో కేంద్రం నుంచి చెత్తను కాపులుప్పాడకు తరలించడానికి రూ. 2.5 కోట్లు, నాలుగింటికి రూ. 10కోట్ల వరకు జీవీఎంసీ వెచ్చిస్తోంది. ఇంతటి విలువైన ప్రాజెక్టును పోటీ లేకుండా రాసా సంస్థకు కట్టబెడుతున్నారు. గుత్తేదారుల మధ్య పోటీ ఉండాలంటే నిబంధనలు సడలించాల్సి ఉంటుంది. తద్వారా జీవీఎంసీకి ఆర్థికంగా లాభం చేకూరే అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది గుత్తేదార్లు టెండరులో పాల్గొంటే కనీసం 10శాతం మేర నిధులు.. అంటే ఏడాదికి రూ.కోటి వరకు మిగులుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఆరేళ్లుగా పోటీ లేకుండా ఒకే గుత్తేదారుకు సీసీఎస్ ప్రాజెక్టు దక్కడంపై విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

తూర్పునౌకాదళంలో నూతన జెట్టీ ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే : భారతదేశం భద్రత, సముద్ర తీర ప్రాంత పరిరక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుతున్నామని భారత నౌకాదళం చీఫ్, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చిన ఆయన గురువారం నేవల్ డాక్‌యార్డులో కొత్తగా నిర్మించిన ఎన్1-ఎన్3 జెట్టీని ప్రారంభించారు. భవిష్యత్తు అవసరాల కోసం జెట్టీని అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం ఆయన భార్య శశిత్రిపాఠి నౌకాదళ ఉద్యోగుల భార్యల సంక్షేమ సంఘం సభ్యులతో కాసేపు మమేకమయ్యారు. తూర్పు నౌకాదళం చీఫ్ వైస్‌అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఇతర నేవల్ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న భారత నేవీ అడ్మిరల్ దినేష్ త్రిపాఠి, తదితరులు

సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం

ఎన్ఏడీకూడలి (కాకానినగర్), న్యూస్‌టుడే: విశాఖ చేరుకునే విమాన ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ టాక్సీ కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ, నగర పోలీసు విభాగం పర్యవేక్షణలో విఘ్నేశ్వర టాక్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాక్సీ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీంతో రాత్రి వేళ వచ్చే వారికి ఇక్కట్లు తీరుతాయన్నారు. విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ... నగరంలో వివిధ ప్రాంతాలకు ధరలు నిర్ణయించామని, వినియోగదారులు ఆ మేరకే చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మేరీ ప్రశాంతి, పశ్చిమ ఏసీపీ, సీఐలు, టాక్సీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కౌంటర్ ప్రారంభోత్సంలో సీపీ శంఖబ్రత బాగ్చి, ఏపీడీ రాజారెడ్డి, తదితరులు

కాస్మెటిక్స్ విక్రయాల ముసుగులో ఆన్‌లైన్ మోసాలు

ఏడుగురిని అరెస్టు చేసిన విశాఖ పోలీసులు

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే : విశాఖ నగరంలో కాస్మెటిక్స్ అమ్మకాల ముసుగులో ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న కేంద్రంపై విశాఖ సైబర్ క్రైమ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. చైనా కేంద్రంగా నడిచే ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న నిందితులతో పాటు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వారితో కలిపి మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు.

★ విశాఖకు చెందిన సూర్యమోహన్ గతంలో హాంకాంగ్, తైవాన్ దేశాలకు వెళ్లాడు. విశాఖకు వచ్చిన తర్వాత సాయిరామ్, గిరిష్‌లతో అతనికి పరిచయమైంది. సాయిరామ్‌కు సైబర్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలు విక్రయించిన అనుభవం ఉంది. వీరు నగరంలో ఏఎన్ బీచ్ ఆసుపత్రి సమీపంలో ఒక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని అలంకరణ సామగ్రి (కాస్మెటిక్స్)ను వియత్నాంకు ఎగుమతులు చేస్తున్నట్లు అందరిని నమ్మించారు. కాల్ సెంటర్ తరహాలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి విశాఖ కేంద్రంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడటం, వచ్చిన నగదును అనధికార గేట్‌వేల ద్వారా చైనా సంస్థలకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలు నిర్వహించేవారు. ఇక్కడ షిఫ్టుల విధానంలో ఆరుగురు యువతులు పనిచేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.25వేల వరకు జీతం చెల్లించేవారు. అలాగే నగదు లావాదేవీల కోసం విశాలాక్షినగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వీరు బెట్టింగ్‌లు, ఇతర ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి మధ్యవర్తులుగా మాత్రమే వ్యవహరించేవారు. వీరికి బ్యాంకు ఖాతాలు, పాస్ పుస్తకాలు, చెక్‌పుస్తకాలు, రిజిస్ట్రేషన్ కాని సిమ్‌లు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఉపయోగించే అధునాతన పరికరాలు, ఫోన్లు వంటివి కొరియర్ ద్వారా దిల్లీ నుంచి వచ్చేవి. బెట్టింగ్‌ల చెల్లింపులకు టిఆర్ఎక్స్ పేమెంట్ గేట్‌వేను ఉపయోగించేవారు. ఇందుకోసం దిల్లీ నుంచి వచ్చిన గుర్తింపులేని సిమ్‌లను ఉపయోగించారు. నిందితుల నుంచి ఒక డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లు 9, సీపీయూలు 8, మానిటర్లు 9, టీఆర్ఎక్స్ పరికరాలు 5, వైఫై రౌటర్ 1, సెల్‌ఫోన్లు 65, బ్యాంకు ఖాతాలు, చెక్ పుస్తకాలు 699, సిమ్‌కార్డులు 135, ద్విచక్రవాహనం, కారు, బంగారు ఉంగరాలు 3 స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుల కోసం గాలిస్తున్నామని, అలానే బాధితుల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని సీపీ తెలిపారు. సైబర్‌క్రైమ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా వ్యూహంతో ఈ బెట్టింగ్ దందాను వెలుగులోకి తీసుకువచ్చారని ప్రశంసించారు. డీసీపీ-1 అజిత వేజెండ్ల, సీఐలు భవానీ ప్రసాద్, అప్పలనాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.







వివరాలు వెల్లడిస్తున్న విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీ చిత్రంలో డీసీపీ-I అజిత వేజెండ్ల, సీఐలు భవానీ ప్రసాద్, అప్పలనాయుడు, ప్రసాద్, స్వాధీనం చేసుకున్న సిమ్‌లు, ఖాతా పుస్తకాలు, ఏటీఎం కార్డులు, ల్యాప్‌టాప్‌లు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి విద్యుత్తు సెక్షన్‌కు చెందిన పాలిటెక్నిక్‌ కళాశాల ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల మధ్య విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు సహాయ ఇంజినీరు యు.సత్యారావు తెలిపారు. దీనివల్ల పట్టణంలో బోయివీధి, ఎగువపేట, నేర్జీలవలసకాలనీ, భీమిలి పెద్దబజారు ప్రాంతాలకు ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భీమిలి

అ వీ ఇ వీ


సంరక్షణ గృహంలో బాలుడు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: తప్పిపోయి తిరుగుతున్న బాలుడికి రక్షణ కల్పించినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. కొద్ది రోజులుగా ఎండాడ ప్రాంతంలో ఓ బాలుడు ఒంటరిగా తిరుగుతున్నట్లు పోలీసు కాల్‌ సెంటర్‌కు ఫిర్యాదు రావడంతో సంబంధిత బాలుడిని పీఎంపాలెం పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారించారు. ఈ క్రమంలో తన పేరు వంతల రాజేష్‌(11)గా చెప్పాడు. అరిలోవ, సింహాచలం ప్రాంతాల్లో తిరుగుతున్నానని, తండ్రి వంతల రంజిత్‌, తల్లి సుభాషిత చిన్నపుడే మరణించినట్లు వివరించాడు. తన ఇల్లు ఎక్కడో తెలియదని, బంధువులున్నా పేర్లు తెలియవన్నాడు. దీంతో బాలుడిని ప్రభుత్వ బాలుర సంరక్షణ గృహానికి అప్పగించారు. ఈ బాలుడి వివరాలు తెలిస్తే పీఎంపాలెం పోలీసులకు, బాలుర సంరక్షణ గృహానికి తెలియజేయాలని సీఐ కోరారు.


వంతల లోకేష్‌

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పలు చోరీ కేసుల్లో పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న నిందితుడిని పీఎంపాలెం నేర విభాగం పోలీసులు ఎట్టకేలకు గురువారం అరెస్టు చేశారు. సీఐ బి.ఎస్‌.ఎస్‌.ప్రకాష్‌ తెలిపిన వివరాలిలా...మిథిలాపురి వుడాకాలనీ రామలింగేశ్వరస్వామి గుడి తాళాలు పగులగొట్టి హుండీలోని రూ.300 నగదు కాజేసినట్లు ఆలయ ఈనెల 6వ తేదీన ఆలయ ఉద్యోగి కె.పావని ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా పాత మధురవాడ మెట్ట ప్రాంతానికి చెందిన టేకుపూడి కనకరాజు(21) నిందితుడిగా గుర్తించారు. తర్వాత అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో చేసిన పలు నేరాల కోసం వెల్లడించాడు. పీఎంపాలెంలో రెండు ఆటోలు, భీమిలిలో రెండు ద్విచక్రవాహనాలు, ఆరిలోవలో ఒక ద్విచక్రవాహనం చోరీ చేసినట్లు ఒప్పుకొన్నాడు. దాంతో సంబంధిత వాహనాలు, రూ.300 నగదును పీఎంపాలెం పోలీసులు స్వాధీన పరుచుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, తదితర సిబ్బందిని ఉన్నతాధికారులు కె.లతామాధురి, ఎ.వెంకట్రావు తదితరులు అభినందించారు.


టేకుపూడి కనకరాజు

బీఆర్‌ఎస్‌ బాధితులకు టీడీఆర్‌లు అందజేయాలి

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు అడివివరం పరిధిలో చేపట్టిన బీఆర్‌ఎస్‌ ఫేజ్‌-2 పనుల్లో భాగంగా ఆస్తులు కోల్పోయిన బాధితులకు తక్షణమే టీడీఆర్‌ ద్రువపత్రాలు జారీ చేసేలా కృషి చేయాలని వార్డు కార్పొరేటర్‌ పీవీ.నరసింహం తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పనులు చేపట్టి ఏడాది కావస్తున్నా మంజూరైన టీడీఆర్‌లను విక్రయించుకునేందుకు ఆన్‌లైన్‌ ఐచ్ఛికాన్ని అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. అలాగే ఇంకా 65మంది బాధితులకు టీడీఆర్‌లు జారీ చేయకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పల్లాను కోరినట్లు నరసింహం తెలిపారు.

కొండ చిలువ కలకలం

పద్మనాభం, న్యూస్‌టుడే: తునివలస గ్రామంలో గురువారం ఓ ఇంట్లోకి కొండ చిలువ రావడం కలకలం సృష్టించింది. స్థానిక జగనన్న కాలనీలో అది ప్రత్యక్షం కావడంతో స్థానికులు హడలిపోయారు. సమీప కొండల నుంచి ఇది వచ్చి ఉంటుందని అంటున్నారు. కొంత మంది యువకులు దాన్ని పట్టి నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆశీలు వసూళ్ల లీజుకు తొలగిన గ్రహణం

అయిదు నెలలకు రూ.2.80 లక్షలకు పాట ఖరారు

భీమునిపట్నం, న్యూస్‌టుడే

భీమిలిలోని జీవీఎంసీ మార్కెట్లలో వ్యాపారుల నుంచి రోజువారీ ఆశీలు వసూలు చేసుకోవడానికి ఎట్టకేలకు పాటదారులు ముందుకు రావడంతో రానున్న అయిదు నెలల కాలానికి రూ.2.80 లక్షలకు పాట ఖరారైంది. భీమిలిలోని లాల్‌ బహాదుర్‌ శాస్త్రీ, కలిగొట్ల సూర్యనారాయణ మార్కెట్లతో పాటు రహదారుల పక్కన కూరగాయలు, చేపలు, మాంసం వ్యాపారాలు జరుగుతుంటాయి. ఈ వర్తకుల ద్వారా ఏటా ఏప్రిల్‌ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు ఆశీలు వసూలు చేసుకోటానికి ముందస్తు పాటలు జరుగుతాయి. 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన వేలంపాటల్లో పాల్గొటానికి ఎవరూ మొగ్గు చూపలేదు. తర్వాత ఏడు నెలల వరకు తొమ్మిది సార్లు పాట నిర్వహించినా ఇదే పరిస్థితి నెలకొంది. చివరిగా ఇటీవల నిర్వహించిన వేలం పాటలకు స్పందన లభించి పాటదారులు ముందుకు రావడంతో ఓ వ్యక్తికి రూ.2.80 లక్షలకు లీజు ఖరారు చేశారు.


భీమిలి లాల్‌ బహాదుర్‌ శాస్త్రీ మార్కెట్‌

నష్టాలు వస్తుండడంతో వ్యాపారుల వెనుకంజ

భీమిలిలో వ్యాపార లావాదేవీలు అంతంత మాత్రంగా ఉండడం, ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో మార్కెట్లని లీజుకు తీసుకోటానికి వ్యాపారులు కొంత కాలంగా ఆసక్తి చూపడం లేదు. రెండేళ్లుగా పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో ఇందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌ ఒకటి నుంచి లీజు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ రెవెన్యూ సిబ్బందితో ఆశీలు వసూలు చేయిస్తున్నారు. మొక్కుబడి వసూళ్ల కారణంగా ఆదాయం అంతంతమాత్రంగా వసూలయ్యేది. ఈ నేపథ్యంలో మార్కెట్లను ఎలాగైనా లీజుకు ఇవ్వాలని పదోసారి నిర్వహించిన వేలంపాటకు స్పందన రావడంతో పాట ఖరారు చేశారు.

భీమిలి జోన్‌లో అయిదేళ్ల లీజుల సమాచారం

సంవత్సరం	ఆశీలు ఆదాయం (రూ.లక్షల్లో)
2019-2020	3.55
2020-2021	5.40
2021-2022	6.07
2022-2023	5.20
2023-2024	6.21

నవంబరు నుంచి లీజుదారునికి అప్పగింత

మార్కెట్లకు లీజు పొందిన వ్యక్తికి నవంబరు ఒకటి నుంచి 2025 మార్చి నెలాఖరు వరకు ఆశీలు వసూలు చేసుకోవటానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాండింగ్‌ కమిటీ ఆమోదానికి భీమిలి జోనల్‌ అధికారులు ఈ అంశాన్ని నివేదించారు. అలాగే గతంలో చెల్లించే వాయిదాల మాదిరిగా కాకుండా లీజుకు తీసుకున్న మొత్తాన్ని ముందస్తుగా ఒకేసారి జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా జీవీఎంసీ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే జీవీఎంసీ నిర్దేశించిన నిబంధనావళి ప్రకారం వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసుకోవాల్సి ఉంటుందని భీమిలి జోనల్‌ కమిషనర్‌ పి.ప్రేమప్రసన్న వాణి పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: వల్లీనగర్‌(మధురవాడ)లో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - అప్పారావు, శ్రీనివాస్‌; వల్లీనగర్‌ వాసులు

సమాధానం: విద్యుత్‌ దీపాలకు మరమ్మతులు చేపడతాం. - శ్రీనివాస్‌, ఏఈ

సమస్య: ఎస్‌బీఐ(పెద రుషికొండ) వెనుక ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - మొహిద్దీన్‌, పెద రుషికొండ

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - సురేష్‌, విద్యుత్‌ ఏఈ

సమస్య: తేజ నగర్‌(ఆనందపురం) సుఖీభవ విల్లాస్‌ రహదారిపై వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. - తేజ నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌

సమాధానం: సంబంధిత ప్రాంతాల్లో శుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. - పారిశుద్ధ్య విభాగం అధికారులు, ఆనందపురం

స్పందించారు.. పరిష్కరించారు

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు పరిధి గొల్లల ఎండాడ జీవీఎంసీ పార్కులో వీధి దీపాలు వెలగక సందర్శకులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో విద్యుత్‌ ఏఈ సురేష్‌ స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయమూర్తి జెడ్పీ పాఠశాల సందర్శన

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.వెంకట శేషమ్మ గురువారం అడివివరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యత, రుచిపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేసి శుభ్రత, సరకుల నాణ్యతపై ఆరా తీశారు. పరిశుభ్రత పాటిస్తూ రుచికరంగా వంటలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, స్మార్ట్‌ఫోన్‌ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అడివివరం జెడ్పీ పాఠశాలలో వంటశాలను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ

న్యాయ విజ్ఞాన సదస్సు

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: సాగర్‌నగర్‌ సమీప ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్‌ సివిల్‌ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ ఎం.వెంకటశేషమ్మ పాఠశాల తరగతి గదులు, వసతిగృహాలు తదితర మౌలిక సదుపాయాల నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. న్యాయ విజ్ఞాన సంబంధిత అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానాచార్యులు ఎస్‌.కె.నూర్జహాన్‌ తదితర బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ బేడామండపంలోని సింహాసనంపై కొలువు దీర్చారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.


విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా పౌర్ణమి తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: పౌర్ణమి తిథిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం సింహాద్రినాథుడి తిరువీధి వేడుక వైభవంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా చూడముచ్చటగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు, వేద పారాయణల నడుమ దేవతామూర్తులను ఆలయ బేడామండపంలో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు.


ఆలయ బేడామండపంలో స్వామివారి తిరువీధి వేడుక

సేవలకు గుర్తింపు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: స్థానిక కళాసాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం భీమిలిలో చిత్రదర్శకుడు డాక్టర్‌ పి.సి.ఆదిత్యతో ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ ఆదిత్య మాట్లాడుతూ సినీ దర్శకుడు జంధ్యాల స్ఫూర్తితో ఎన్నో లఘు చిత్రాలు తీశానని, వాటిలో ది స్పైస్‌ ఆఫ్‌ లిబర్టీ అనే అమెరికా చిత్రానికి తాను చేసిన దర్శకత్వానికి ప్రశంశలు వచ్చాయన్నారు. అనంతరం కళాసాహితి అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్‌ వర్మ ఆధ్వర్యంలో డా.ఆదిత్య దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. కళాసాహితి కార్యదర్శి ఎ.సన్యాసిరాజు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్‌ ఆదిత్య దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఆలయాల్లో చోరీ

పద్మనాభం, న్యూస్‌టుడే: మండలంలోని కొవ్వాడ, పెంట గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాల్లోని హుండీలను గుర్తు తెలియని అగంతకులు గురువారం తెల్లవారు జామున పగులగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు.

పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్య

తగరపువలస, న్యూస్‌టుడే: ఓ పారిశుద్ధ్య కార్మికుడు బలవన్మరణానికి పాల్పడినట్లు భీమిలి స్టేషన్‌ మహిళ ఎస్‌.ఐ. ఎన్‌.గౌరి పేర్కొన్నారు. ఆ వివరాలిలా.. భీమిలి మండలం తాళ్లవలస ఎస్సీకాలనీకి చెందిన గోక గురు ఈశ్వరరావు(42) పంచాయతీ స్వీపరుగా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య రమాదేవి, పిల్లలు గాయత్రి, తరుణ్‌ ఉన్నారు. తరచూ మద్యం తాగుతుండడంతో భార్య మందలించేది. ఈ విషయమై ఈనెల 16వ తేదీ రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఇంట్లోని దోమల నివారణ మందును ఈశ్వరరావు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌.ఐ. పేర్కొన్నారు.

సంప్రదాయబద్ధంగా వాల్మీకి జయంతి

సింహాచలం, సాగర్‌నగర్‌, కొమ్మాది, ఆనందపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు శివారు సింహాచలనగర్‌ ప్రాథమిక పాఠశాలలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. ★ రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్‌ (టీసీఆర్‌ అండ్‌ టీఎమ్‌), గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలోనూ ఈ వేడుకలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ (ఈడీ) డాక్టర్‌ రాణీ మంద తదితరులు పాల్గొన్నారు.★ బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లోనూ ఈ వేడుకలు నిర్వహించారు. కమాండెంట్‌ కె.వి.మురళీకృష్ణ తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజించారు. అదనపు కమాండెంట్‌ సీహెచ్‌.వి.ఎస్‌.పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు. ★ ఆనందపురం మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాలలోనూ ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి విజయరాం పురానికి చెందిన ఇందూ జ్ఞానవేదిక సభ్యుల ఆధ్వర్యంలో గురువారం భీమిలిలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి అవగాహన కల్పించారు. భగవద్గీతలో ఉన్న ధర్మాలను ప్రతీ ఒక్కరూ ఆచరించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి: గంటా

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా భీమిలి మండలం అమనాం, బోడమెట్టపాలెం, దాకమర్రి గ్రామాల్లో రూ.77 లక్షలతో చేపట్టిన పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు కోరాడ రాజబాబు, డి.ఎ.ఎన్‌.రాజు, జి.వెంకటప్పడు, కె.రామానాయుడు, ఎంపీడీవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


అమనాంలో రహదారి నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో కూటమి నాయకులు, తదితరులు

పరిపాలనపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న సీఈవో నారాయణమూర్తి

పద్మనాభం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయి పరిపాలనా అంశాలపై ప్రజా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్‌ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. మండల పరిషత్‌ సమావేశ మందిరంలో గురువారం జరిగిన వార్డు సభ్యుల శిక్షణ శిబిరానికి సీఈవో హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా, పథకాల నిర్వహణ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో బి.విజయ్‌కుమార్‌ కూడా వివిధ పరిపాలనా అంశాలపై వివరించారు.

ఇదేమి చిత్రమో..!

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా జీవీఎంసీ 8వవార్డు పరిధి పెద రుషికొండ సచివాలయంపై ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ చిత్రమే దర్శనమిస్తుండడం విమర్శలకు తావిచ్చింది. తొలగించాలని సంబంధిత సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానిక తెదేపా నాయకులు అంటున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


పెద రుషికొండ సచివాలయ బోర్డు ఇలా..


మధురవాడ పైవంతెన సమీపంలో..


చెరువును తలపిస్తున్న రేవళ్లపాలెం మాస్టర్‌ప్లాన్‌ రహదారి


చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఇలా..

లోతట్టు ప్రాంతాలు జలమయం


ముసలయ్యపాలెం(సాగర్‌నగర్‌) వద్ద..


ఎండాడ వరాహగిరినగర్‌లో..

కొమ్మాది, సాగర్‌నగర్‌, ఎండాడ, న్యూస్‌టుడే: వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జోన్‌-2 పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. పలు చోట్ల రహదారులు చెరువులను తలపించాయి. చిన్నపాటి వర్షానికి కూడా చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నీరు నిలిచిపోతుందని అధికారులకు తెలిసినా ఆ మేరకు అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. రేవళ్లపాలెం మాస్టర్‌ప్లాన్‌ రోడ్డు పని అసంపూర్తిగా నిలిచిపోవడంతో పలు చోట్ల ఆ మార్గం చెరువును తలపించింది. ఎంఎస్‌ఆర్‌ లే-అవుట్‌కు ఆనుకుని ఉన్న గెడ్డను పట్టించుకోకవర్షపునీటితో పొంగి పొర్లింది. మధురవాడ పైవంతెన సేవా రహదారి వద్ద వర్షపు నీరు మురుగునీటితో కలిసిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండవాలు ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


దసపల్లా లేఅవుట్‌లో..

పల్లె పండగ వారోత్సవాలు

పద్మనాభం, న్యూస్‌టుడే : పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పద్మనాభం గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్లకు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి భూమి పూజ నిర్వహించారు. పద్మనాభం-నీళ్లకుండీల రోడ్డు నుంచి గోస్తనీనదికి వెళ్లే మార్గంతోపాటు శ్మశానానికి వెళ్లే మార్గాల్లో రూ.30లక్షలతో నిర్మించనున్న రహదారి పనులకు ఆమె భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కె.నగేష్‌కుమార్‌, కె.సుమంత్‌ నాయుడు, ఆర్‌.సన్యాసిరావు, ఎన్నింటి నరసింగరావు, హంస మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌కు శస్త్ర చికిత్స

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: నోటి క్యాన్సర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురైన వాల్తేరు ప్రాంతానికి చెందిన బి.రామారావు(47)కు గీతం ఆసుపత్రి, గీతం ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ (జిమ్‌సర్‌) వైద్య నిపుణులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. నాలుక వెనుక భాగంలో నెల రోజులుగా తీవ్ర నొప్పితో బాధ పడుతూ రామారావు గీతం ఆసుపత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో ఆయన నోటి క్యాన్సర్‌ బారిన పడినట్లు గుర్తించి అవసరమైన వైద్య సాయం అందించారు. దీన్ని విజయవంతంగా చేపట్టిన వైద్య బృందాన్ని జిమ్‌సర్‌ ప్రొ-వీసీ డాక్టర్‌ బి.గీతాంజలి గురువారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

విశాఖ తూర్పు

ఏయూసీఈలో రెండు రోజుల సదస్సు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 18, 19 తేదీలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎం.ఎల్), డేటా సైన్స్(డి.ఎస్.)పై తెలుగులో చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు సదస్సు సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఐటీసీఏ విభాగాలు ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని అన్నారు. ఏయూ డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో జరగనున్న ఈ కార్యక్రమానికి విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్‌లు, బోధన సిబ్బంది, పరిశ్రమల నిపుణులు పాల్గొనవచ్చునని, శుక్రవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఈ సదస్సును ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: భానునగర్ లేఅవుట్‌లో పార్కు స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని, ఆ స్థలాన్ని కాపాడి స్థానికులకు అప్పగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హెచ్.బి.కాలనీ నుంచి వెంకోజీపాలెం వెళ్లే రోడ్డులో ఇళ్లు కోల్పోయిన 93 కుటుంబాలకు 127 ప్లాట్‌లతో లేఅవుట్ వేశారన్నారు. ప్రజా ప్రయోజనాల నిమిత్తం 450 గజాల స్థలాన్ని కేటాయించారని, ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని వివరించారు. ఆక్రమణదారుల నుంచి పార్కు స్థలాన్ని రక్షించి, కాలనీవాసులకు అప్పగించాలని కోరారు. అదే విధంగా జేఆర్‌నగర్ కాలనీకి ఆనుకున్న ఉన్న పార్కు స్థలం వివాదాల్లో ఉందని, దాన్ని పరిష్కరించి ఉద్యానవనంగా తీర్చిదిద్దాలని కోరారు.


జీవీఎంసీ కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

మహా అన్నదానం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల సందర్భంగా ఉషోదయకూడలిలో ఆటోస్టాండ్ ప్రతినిధులు ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెదేపా నాయకులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కిర్లంపూడి లేఔట్లో వెలిసిన లలిత దేవి అమ్మవారు ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకొని గురువారం ఉదయం చండీ యాగం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు కాండూరి లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


సిద్ధం చేసిన 108 కలశాలు

రెక్టార్ ఆకస్మిక తనిఖీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు గురువారం వర్సిటీలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోషల్ వర్క్, సోసియాలజీ, జర్నలిజం, ఎకనామిక్స్, తెలుగు సైకాలజీ, హిందీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాలలో సిబ్బంది హాజరు పట్టీలను, అక్కడ బోధన జరుగుతున్న విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. ఆరోగ్యకర వాతావరణంలో బోధన జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ నేతృత్వంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఏయూ సోషల్ వర్క్ విభాగంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు

నిందితులపై చర్యలు తీసుకోవాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఓ విద్యార్థిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయిన కారును గుర్తించాలని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలిలా.. ఈనెల 7వ తేదీన నగరంలోని రాంనగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి చరణ్ సాయి వంశీ ద్విచక్రవాహనంపై గీతం డీమ్డ్ వర్సిటీకి వెళ్తుండగా ఓ కారు జోడుగుళ్లపాలెం తీరంలో వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ ఘటనలో డ్రైవర్ ఆపకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు. నిందితుడిని గుర్తించి శిక్షించాలని తండ్రి ఉదయ్‌శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జేసీఐ నూతన కమిటీ ఎన్నిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొత్త అధ్యక్షుడు డాక్టర్ సోమశేఖర్ ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగుతారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమా, విజయ్‌కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు

భారీ వర్షం.. రహదార్లు జలమయం


ఎంవీపీలో పొంగి ప్రవహిస్తున్న గెడ్డ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో గురువారం కురిసిన భారీ వర్షంతో ఎంవీపీకాలనీలో పలు రహదారులు జలమయమయ్యాయి. కల్వర్టులు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగి రహదారులను ముంచెత్తింది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గెడ్డల్లోని నీరంతా సముద్రంలోకి వెళ్లడంతో తీరమంతా వ్యర్థాలతో నిండిపోయింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం వర్షపునీటితో నిండిపోయాయి. తెన్నేటిపార్కు వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి.


తెన్నేటిపార్కు వద్ద విరిగి పడిన కొండ రాళ్లు


ఎంవీపీ డబుల్ రోడ్డులో..

కూలిన రక్షణ గోడ

ఆరిలోవ, న్యూస్‌టుడే: దీనదయాళపురంలో ఉన్న బాలుర పరిశీలన గృహం, వీధి బాలల వసతి గృహానికి మధ్యలో ఉన్న రక్షణ గోడ వర్షాలకు తడిసి కూలిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భూమి నానిపోయి గోడ పునాది కుంగిపోవడంతో గురువారం ఉదయం గోడ కూలిపోయింది. కూలిన సమయంలో గోడ దగ్గరలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గురువారం మధ్యాహ్నం గోడ కూలిన ప్రాంతాన్ని జోన్ 2 జోనల్ కమిషనర్ సింహాచలం సందర్శించారు. బాలుర పరిశీలన గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య, వీధి బాలల వసతి గృహం వార్డెన్ రమణలకు జోనల్ కమిషనర్ తగు జాగ్రత్తలు సూచించారు. అనంతరం బాల నేరస్తులు ఉన్న గదులను పరిశీలించారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసన్స్‌బే కాలనీలో ఎక్కడ పడితే అక్కడ రహదారుల్లో నీరు వరదలై పారుతుంది. వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. లాసన్స్‌బే కాలనీలోని పలు వీధుల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది.


లాసన్స్‌బే కాలనీలో రహదారిపై జల ప్రవాహం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జోడుగుళ్లపాలెం నుంచి సాగర్‌నగర్‌కు వెళ్లే సీతకొండ మలుపు వ్యూపాయింట్ ఎదురుగా గురువారం సాయంత్రం కొండమట్టి రాళ్లు జారిపడ్డాయి. బీచ్ గస్తీ పోలీసులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తర్వాత జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది మట్టి, రాళ్లు తొలగించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీటితో పెదగదిలి గెడ్డ ప్రవహించింది. హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెంలో లోతట్టు ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. సాయంత్రం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు వర్షం కురవడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.


పెదగదిలి గెడ్డ ఇలా..

పోషకాహారంతో ఆరోగ్య జీవనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని పోషకాహార నిపుణులు ఎస్.వి.ఎస్.సురేష్‌బాబు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సమతా కళాశాలలో గురువారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ పోషకాహారంతో రోగనిరోధక శక్తి పెరిగి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య విజయబీరేంద్ర, జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిత్యం 30నిమిషాలు వ్యాయామం కోసం కేటాయించాలని కోరారు. వర్సిటీ నోడల్ అధికారి రామారావు యుదు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మధురవాడ 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

★ సమస్య : ఎంవీపీకాలనీ సెక్టార్-3లోని 32/బి/7 స్తంభానికి చెందిన వీధి దీపం వెలగడం లేదు. – వి.రాజు

★ సమాధానం : పరిశీలించి పాడైన వీధి దీపాలను మారుస్తాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

★ సమస్య : ఎంవీపీకాలనీ అప్పుఘర్ నుంచి పైలాన్ కూడలికి వచ్చే మార్గంలో గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. – హనుమంతరావు

★ సమాధానం: త్వరలో మీ ప్రాంతంలోని గొయ్యిని పూడ్చుతాం.– శ్రీను, వర్క్ ఇన్‌స్పెక్టర్

నవంబరులో వైజాగ్ జూనియర్ లిటరరీ ఉత్సవం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఐదో వైజాగ్ జూనియర్ లిటరరీ ఉత్సవాన్ని నవంబరు 23,24 తేదీల్లో నిర్వహించనున్నారు. ఉత్సవ గోడపత్రికను గురువారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆవిష్కరించారు. లిట్ లాంతర్ కల్చర్, లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ 2018 నుంచి విశాఖలో ఈ ఉత్సవం నిర్వహిస్తోందని, ఈ ఏడాది హవామహల్‌లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాహిత్యంలో రాణించేలా చిన్నారులను ప్రోత్సహించాలని ఎంపీ భరత్ కోరారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

క్రీడలు ఉత్సాహాన్నిస్తాయి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ పేర్కొన్నారు. ఏయూ జిమ్నాజియం మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న పురుషుల కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో ప్రతిభ చూపిన వారు ఏయూ జట్టుకు ఎంపికవుతారన్నారు. కబడ్డీ పురుషుల ఫైనల్స్ ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, సమతా కళాశాల మధ్య జరగ్గా 14, 43 పాయింట్ల తేడాతో సమతా కళాశాల విజేతగా నిల్చింది. డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల మధ్య జరిగిన పోటీలో 21పాయింట్లతో డాక్టర్ వి.ఎస్.కృష్ణ కళాశాల మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పీడీ విజేతలను అభినందించారు. ఆచార్య ఎ.పల్లవి, వివిధ కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.



కబడ్డీ ఫైనల్స్‌లో విజేతల బృందం

ఆలస్యంగా బయలుదేరిన కోర్బా రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైలు ఆలస్యమవడంతో విశాఖ-కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ ఈనెల 17న రాత్రి 9.05 గంటలకు బదులుగా 1.25 గంటలు ఆలస్యంగా రాత్రి 10.30 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మత్తు పదార్థాల నివారణపై సదస్సు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత చెడు వ్యసనాలు, నేర ప్రవృత్తికి పాల్పడుతున్నారని జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు రహమున్నీషా బేగం అన్నారు. బీచ్‌రోడ్డు యూత్‌హాస్టల్లో గురువారం ఉదయం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ మత్తును అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువత అధికంగా మత్తుపదార్థాలకు బానిసగా మారుతున్నారని అన్నారు. ఎస్.ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు సేవించడం ద్వారా నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వాలంటీర్ హెల్త్‌సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సురేష్‌కుమార్, నెహ్రూయువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.ఉమామహేశ్వరరావు, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రహమున్నీసా బేగం

వసతిగృహాల్లో సదుపాయాలపై ఆరా


వసతిగృహ అధికారులకు సూచలిస్తున్న న్యాయమూర్తి శేషమ్మ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జిల్లా న్యాయ సేవల సాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ గురువారం ఎంవీపీకాలనీలోని బాలుర వసతిగృహం, జైలురోడ్డులోని బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. మెనూ అమలు, విద్యాప్రమాణాలు తదితర అంశాలను తెలుసుకున్నారు. వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. వసతిగృహాల్లో సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఆశాఖ డి.డి. కె.రామారావు, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

ఆరిలోవ, న్యూస్‌టుడే: పైనాపిల్ కోలనీ, దీనదయాళపురంలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సివిల్ జడ్జి వెంకట శేషమ్మ గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం పదార్థాలను పరిశీలించారు. వర్షాకాలం విద్యార్థులకు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులకు వివరించారు. పర్యటనలో చినగదిలి మండల విద్యాశాఖాధికారిణి పి.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షికి ఘన నివాళి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి జయంతిని గురువారం గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రతినిధులు డి.దక్షిణామూర్తి, డి.వి.ఎస్.కామేశ్వరరావు, ఆచార్య ప్రగడ రాజగణపతి పాల్గొన్నారు. మానవీయ విలువలకు, ఉత్తమ పాలనకు, కుటుంబవిలువలకు మణిదర్పణంగా రామాయణ మహా కావ్యాన్ని వాల్మీకి తీర్చిదిద్దారన్నారు. అనంతరం విద్యార్థులు సామూహిక రామనామ పారాయణం చేశారు. ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్, డైరెక్టర్ గిరిధర్, అధ్యాపకులు వారణాసి వెంకటేశ్వరశర్మ, యు.వి.ఎస్.శాస్త్రి పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కృషి, పట్టుదల ఉంటే గొప్పవారుగా మారుతారని, అందరికీ ఆదర్శప్రాయుడుగా నిలుస్తారని వి.ఎం.ఆర్.డి.ఎ జాయింట్ కమిషనర్ కె.రమేష్ అన్నారు. ఓ బోయి మహర్షిగా మారి రామాయణం లాంటి కావ్యం రాయడం ఓ అద్భుతమని అన్నారు. ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంక అధికారి హరిప్రసాద్, డి.ఎఫ్.వో శాంతిస్వరూప్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పలు చోరీ కేసుల్లో పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న నిందితుడిని పీఎంపాలెం నేర విభాగం పోలీసులు ఎట్టకేలకు గురువారం అరెస్టు చేశారు. సీఐ బి.ఎస్.ఎస్.ప్రకాష్ తెలిపిన వివరాలిలా... మిధిలాపురి వుడాకాలనీ రామలింగేశ్వరస్వామి గుడి తాళాలు పగులగొట్టి హుండీలోని రూ.300 నగదు కాజేసినట్లు ఈనెల 5వ తేదీన ఆలయ ఉద్యోగి కె.పావని ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా పాత మధురవాడ మెట్ట ప్రాంతానికి చెందిన టేకుపూడి కనకరాజు(21) నిందితుడుగా గుర్తించారు. తర్వాత అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో చేసిన పలు నేరాల కోసం వెల్లడించాడు. పీఎంపాలెంలో రెండు ఆటోలు, భీమిలిలో రెండు ద్విచక్రవాహనాలు, ఆరిలోవలో ఒక ద్విచక్రవాహనం చోరీ చేసినట్లు ఒప్పుకొన్నాడు. దాంతో సంబంధిత వాహనాలు, రూ.300 నగదును పీఎంపాలెం పోలీసులు స్వాధీన పర్చుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, తదితర సిబ్బందిని ఉన్నతాధికారులు కె.లతామాధురి, ఎ.వెంకట్రావు తదితరులు అభినందించారు.

జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: జాతీయ యువజనోత్సవాలు(యూత్ ఫెస్టివల్) ప్రజాతంత్ర-2024కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన కార్యాలయంలో అభినందించారు. నవంబరు 16 నుంచి 18వ తేదీ వరకు లక్నోలో జరగనున్న ఈ ఉత్సవాలలో ఏయూ నుంచి ఎం.శివాని లహరి, డి.హర్షిత పాల్గొంటారు. ప్రజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ఇండియా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ఎన్.ఎస్.ఎస్. సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

శిరస్త్రాణం ధరిస్తేనే అనుమతి

నగరంలో శిరస్త్రాణం (హెల్మెట్) ధరించని ద్విచక్ర వాహన చోదకులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. రహదారి ప్రమాదాల నియంత్రణకు విధిగా శిరస్త్రాణం ధరించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు శిరస్త్రాణం ధరించకుండా వచ్చిన వాహనచోదకులకు కార్యాలయాల్లోకి అనుమతులు కూడా ఇవ్వడం లేదు. మూడో పట్టణ పోలీసు స్టేషన్, పోలీసు కమిషనరేట్ సమావేశమందిరం, పోలీసు మైదానం లోపలికి వెళ్లాలంటే ద్విచక్ర వాహన చోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అనుమతులు లేవంటూ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



పోలీసు కమిషనరేట్ సమావేశమందిరానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన బోర్డు



మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లోకి ప్రవేశించే ప్రధాన మార్గం వద్ద..

ఎస్ఎల్ కెనాల్ అభివృద్ధికి ప్రణాళికలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని ఎస్ఎల్ కెనాల్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కెనాల్‌ను పరిశీలించారు. 2.2 కిలోమీటర్ల మేర విస్తరించిన గెడ్డలో వర్షాలు పడితే ఎక్కడికక్కడ వ్యర్థాలు అడ్డుపడటంతో నీరు నిలిచిపోతోందన్నారు. పోర్టు యాజమాన్యంతో చర్చలు జరిపి వారి సూచనలు తీసుకోవాలన్నారు. ప్రధాన ఇంజినీరు శివప్రసాద్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. ★ పరిశ్రమలకు అవసరమైన నీటిని మళ్లించడానికి నరవ నుంచి శీలానగర్ మీదుగా 1300 ఎంఎం ఎంఎస్ పైపులైను వేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. గురువారం కోరమాండల్ కార్యాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నీటిని పైపులైను ద్వారా తరలించనున్నట్లు పేర్కొన్నారు.


ఎస్ఎల్ కెనాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు

అ వీ ఇ వీ

గంజాయి అక్రమ రవాణా గుట్టు రట్టు

● 145 కిలోల సరకు, నాటు తుపాకీ స్వాధీనం

విజయవాడ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా నుంచి తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు సభ్యుల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముఠా వాహనంలో 145 కిలోల గంజాయితోపాటు ఆరు బుల్లెట్లతో ఓ దేశవాళీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన రమేష్ వినేష్‌కుమార్, కుమారన్ మారి మూర్తిలు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి గురువారం కారులో గంజాయి తరలిస్తున్నారు. స్పష్టమైన సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు రామవరప్పాడు రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. గంజాయి తరలిస్తున్న కారు రాగానే పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. కారులో గంజాయితోపాటు దేశవాళీ తుపాకీ ఉండడంతో పోలీసులు అవాక్కయ్యారు. నిందితులతోపాటు గంజాయి, తుపాకీని స్వాధీనం చేసుకుని పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. మరింత లోతుగా విచారించగా వీరిపై విశాఖపట్నం, తమిళనాడుల్లో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు.

పామును పట్టుకున్నారు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరులో గురువారం నాగుపాము కలకలం సృష్టించింది. స్నేక్ సేవర్ సొసైటీ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన చాకచక్యంగా పట్టుకొన్నారు. దూరంగా తీసుకుని వెళ్లి విడిచిపెట్టారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ హెల్త్‌సిటీలో ఉన్న క్యూ వన్ ఆసుపత్రి సమీపంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పిడుగు పడింది. ప్రాణ నష్టం జరగలేదు. ఆరిలోవ ఎస్ఎస్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. జెంపర్లు తెగిపోవడంతో విద్యుత్తు సరఫరా ఆగిందని సాయంత్రానికల్లా విద్యుత్తు సరఫరా పునరుద్ధించామని ఆరిలోవ ఎస్ఎస్ ఎ.ఇ. సిహెచ్ హేమ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే...

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఇందిరానగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. దీనివల్ల ఇందిరానగర్, ఆదర్శనగర్, రాజీవ్‌నగర్, వెటర్నరీకాలనీ, సుందర్‌నగర్, ఎస్ఐజీ నగర్, రవీంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు

ఆరిలోవ, న్యూస్‌టుడే: తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ గురువారం పైనాపిల్ కాలనీలో ఉన్న సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో అదనపు ఎస్.పి. ప్రేమ్ కాజల్‌కు ఫిర్యాదు కాపీ అందజేశారు. వివరాల్లోకి వెళితే.. 'గత ఏడాది ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థలో అవినీతి జరిగిందని (స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కాం) నిరాధారమైన ఆరోపణలతో చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఆ ఆరోపణలలో వాస్తవం లేదని ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఏమీ జరగకపోయినా అన్యాయంగా చంద్రబాబును అరెస్టు చెయ్యడంతో అప్పట్లో చాలా మంది చంద్రబాబు అభిమానులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఎవరు అండగా నిలుస్తారు? కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి. దీనికి సీబీఐ బాధ్యత వహించాలని, చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయాలని ఆదేశించిన గత ప్రభుత్వ పెద్దలను తక్షణమే అరెస్టు చెయ్యాల'ని కోరారు. బొడ్డేపూడి దొరబాబు, డాక్టర్ పప్పూర్ నికుంజ్ పాల్గొన్నారు.

ఆహార అలవాట్లపై అవగాహన

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్‌లో గురువారం గెట్ క్వాలిఫైడ్ సంస్థ ఆధ్వర్యంలో 'లైఫ్ స్టైల్ డిజార్డర్స్' అనే అంశంపై సదస్సు జరిగింది. క్లినికల్ న్యూట్రిషన్ నిపుణులు చాప సాయి కిరణ్ మాట్లాడుతూ సగటు మనిషి జీవన సరళి దుష్ఫలిత నియంత్రణ నిర్వహణ అంశం నేటి సమాజంలో ప్రధాన అంశమైందని తెలిపారు. ఆహారం ఎలా తినాలో, ఏమి తినాలో అవగాహన కల్పించారు. పోర్టు హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉషారాణి నేటి జీవన విధానం, ఆహార అలవాట్లు, పౌష్టికాహారం తదితర అంశాల గురించి వివరించారు. గెట్ క్వాలిఫైడ్ సంస్థ మార్కెటింగ్ హెడ్ ముకేష్, ఆసుపత్రి మరో ముఖ్య అధికారిణి ప్రసన్న లక్ష్మి, బాబూరావు, సీనియర్ వైద్యులు రోణంకి సునీత, లక్ష్మి, పోర్టు హాస్పిటల్ ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

వసతిగృహాల్లో సదుపాయాలపై ఆరా

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జిల్లా న్యాయ సేవల సాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి. శేషమ్మ గురువారం ఎంవీపీకాలనీలోని బాలుర వసతిగృహం, జైలురోడ్డులోని బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. మెనూ అమలు, విద్యాప్రమాణాలు తదితర అంశాలను తెలుసుకున్నారు. వసతిగృహ విద్యార్థులకు న్యాయమైన సేవలు అందించాలని సూచించారు. వసతిగృహాల్లో సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఆశాఖ డి.డి. కె.రామారావు, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.


తాటిచెట్లపాలెం-ధర్మానగర్ రోడ్డు పక్క గోతుల్లో చేరిన నీరు


పొంగి ప్రవహిస్తున్న రైల్వేన్యూకాలనీలోని ఎర్రిగెడ్డ


గురుద్వారా కూడలి దరి జాతీయ రహదారిపై నిలిచిన నీరు


సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో రహదారిపై వరద నీరు

కుంభవృష్టితో పల్లపు ప్రాంతాలు జలమయం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : నగరంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఉరుములు మెరుపులతో కుంభవృష్టి కురవడంతో తాటిచెట్లపాలెం, ధర్మానగర్, రైల్వేన్యూకాలనీ మెయిన్‌రోడ్డుపై నీరు వరదలా ప్రవహించింది. సమీపంలోని దుకాణాల్లోకి, ఇళ్లల్లోకి భారీగా వర్షం నీరు చేరింది. తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ ప్రాంతాల్లో రోడ్లపై రెండు మూడు అడుగుల నీరు నిలిచిపోవడంతో అందుల్లోంచే కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లాల్సి వచ్చింది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని డ్రైనేజీల నుంచి వ్యర్థాలు భారీగా రోడ్డు మీదకు కొట్టుకు వచ్చాయి. దీంతో పరిసరాలు దుర్గంధపూరితంగా తయారయ్యాయి. ఎనభై అడుగుల రోడ్డు, న్యూకాలనీలోని మసీద్ వీధి రోడ్డులో డ్రైనేజీ పొంగి ప్రవహించింది. ముఖ్యంగా ధర్మానగర్ నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే రోడ్డు వర్షానికి దారుణంగా తయారైంది. రోడ్డులో చాలా భాగం గోతులు, గతుకులతో నిండింది.

పొంగి ప్రవహించిన గెడ్డలు: రైల్వేన్యూకాలనీలోని గెడ్డలన్నీ నిండుకుండల్లా ప్రవహించాయి. కొన్ని చోట్ల పూడికలు అడ్డుపడడంతో అందులో నీరంతా చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తింది. మసీద్‌రోడ్డు, హరగోపాల్ పాఠశాల రోడ్డులో డ్రైనేజీలు పొంగి ప్రవహించడంతో చెత్త రోడ్డు మీదకు కొట్టుకువచ్చింది. రైల్వేన్యూకాలనీ చంద్రనగర్‌లో గెడ్డలోంచి నీరు సమీపంలోని ఇళ్లల్లోకి వెళ్లింది. నగరంలో భారీ వర్షం కురిసినప్పుడల్లా తమకు ఈ ఇక్కట్లు తప్పడం లేదని, సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: గురుద్వారా కూడలి దరి జాతీయ రహదారి, సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో వరద నీరు నిలిచిపోయింది. టీపీటీ కాలనీ బృందావన్ పార్కు వెనుక దిగువ ప్రాంతంలో డ్రైనేజీ పొంగి మురుగునీరు ప్రవహించింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే పొంగిపోయి మురుగుతో స్థానికులకు మురుగుతో తంటాలు తప్పడం లేదు.

మాధవధార, న్యూస్‌టుడే: కళింగనగర్, సీతన్నగార్డెన్స్, మాధవధార ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారులు చిత్తడిగా మారాయి. జ్యోతినగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల క్రీడా ప్రాంగణమంతా వర్షపు నీటితో నిండిపోయింది. సేవా రహదారికి ఆనుకొని ఉన్న రామన్నకాలనీ, అప్పయ్యనగర్, వంశీనగర్ గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తూ, వ్యర్థాలు కొట్టుకువచ్చాయి.


టీపీటీకాలనీ బృందావనం పార్కు దరి పొంగిన డ్రైనేజీ


వర్షపు నీరు నిలిచిపోయి చిత్తడిగా మారిన సీతన్నగార్డెన్స్ ఆలయానికి వెళ్లే రహదారి


జ్యోతినగర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

సిబ్బంది తీరుపై డీసీపీ-2 తీవ్ర అసహనం

మాధవధార, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల నుంచి త్వరితగతిన ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరించాలని విశాఖ జోన్-2 డీసీపీ మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆమె వచ్చేసరికి స్టేషన్ బయట ఫిర్యాదు దారులు పెద్ద సంఖ్యలో ఉండటంతో స్టేషన్ సిబ్బంది తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక కేసు నిమిత్తం కోడి పుంజులను తీసుకువచ్చి స్టేషన్‌లో ఉంచడంతో ఆ ప్రాంగణమంతా అపరిశుభ్రంగా మారడంతో స్టేషన్ శుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పెండింగ్ కేసులు ఎన్ని పరిష్కరించారు, రోజుకి ఎంత మంది ఫిర్యాదిదారులు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు వచ్చే సిబ్బంది హాజరు, పనితీరు పట్ల ఆరాతీసి, రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో చేపట్టవలసిన పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ వి.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


స్టేషన్ వద్ద సీఐకు సూచనలిస్తున్న డీసీపీ-2 మేరీ ప్రశాంతి

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను విరమించుకోవాలి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద గత 17 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు గొర్లె చందు శిబిరం వద్ద సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. బి.ఎం.ఎస్.ప్రధాన కార్యదర్శి రవి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, హెచ్.ఎం.ఎస్.నాయకులు మంగనాయకులు మద్దతు తెలిపారు. నాయకులు గురుప్రసాద్, వెంకటరావు, రమణ ఫ్రెడ్డీ, సూర్యనారాయణ, ఒమ్మి అప్పారావు, సన్నిబాబు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 11 కె.వి. అక్కయ్యపాలెం సెక్షన్‌లోని ఎన్‌జీజీఓఎస్ కాలనీ ఫీడర్‌లోని 132 కె.వి. హెచ్.టి. లైన్ల మరమ్మతులలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, సాయిబాబా ఆలయం, రామచంద్రనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

గురుద్వారా, న్యూస్‌టుడే: ఆశీల్‌మెట్ట సెక్షన్ పరిధిలో 11కేవీ విద్యుత్తు ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధాహ్నం 2 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 డీఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిపురం, గురుద్వారా పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వర్షాలలోనూ తాగునీటికి ఇబ్బంది

సీతంపేట, న్యూస్‌టుడే : 25వ వార్డు సీతంపేటలోని గణేష్‌నగర్‌లో శ్రీపార్వతీశ్వర ఆలయం వెనుక వీధుల్లో వర్షాలలోనూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. గతంలో ప్రతి రోజు ఉదయం 8గంటలకు కుళాయి నీరు అందించేవారు. కానీ, ఇప్పుడు ఏసమయంలో వస్తుందో తెలియడం లేదని ఈ వీధి మహిళలు చెబుతున్నారు. గురువారం ఈ వీధుల్లో ఉదయం 11 గంటల సమయంలో పది నిమిషాలు, మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మరో పది నిమిషాలు మాత్రమే ఇచ్చారని, దీంతో ఎవరూ నీరు పట్టుకునే అవకాశం లేకపోయిందని వాపోయారు. అధికారులు ఉదయం వేళల్లో నిర్దిష్ట సమయంలో తాగు నీరు అందించాలని కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పాతనగరం మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం మన్యుసూక్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.


హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు

రామజోగిపేటలో భారీ అన్నదానం

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా 29వ వార్డు రామజోగిపేట సాయి దుర్గా ఆటో స్టాండ్ డ్రైవర్ల ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, స్థానికులకు భోజనం వడ్డించారు.


భోజనం వడ్డిస్తున్న మన్యాల శ్రీనివాస్

ఆలస్యంగా బయలుదేరిన కోర్బా రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైలు ఆలస్యమవడంతో విశాఖ-కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ ఈనెల 17న రాత్రి 9.05 గంటలకు బదులుగా 1.25 గంటలు ఆలస్యంగా రాత్రి 10.30 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

తయారీ రంగానికి ప్రోత్సాహం శుభపరిణామం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ, పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభపరిణామమని ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' పదం ప్రపంచ బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు. ఏపీ 4.0లో భాగంగా పరిశ్రమలను ప్రోత్సహించి, ఉపాధిని పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. పెట్టుబడిదారులకు త్వరగా వ్యాపార అనుమతులు మంజూరయ్యేలా చూడాలని సూచించారు.

ఘనంగా ఎరుకుమాంబ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం వార్షిక వేడుకల్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ గొలగాని వీరారావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఇ.ఒ. జి.వి.రమాబాయి స్వాగతం పలికారు. ముందుగా ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో పాండురంగారావు, అల్లూరి సత్యనారాయణరెడ్డి, పి.లక్ష్మీశివప్రసాద్, అకిరెడ్డి జగదీష్, భాజపా నేతలు పాల్గొన్నారు.


అమ్మవారికి అన్నాభిషేకం జరిగిన దృశ్యం


అన్నదానంలో వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైభవోపేతంగా ఉత్సవం

మురళీనగర్, న్యూస్‌టుడే : 49వ వార్డు పట్టాభిరెడ్డితోటలో జయదుర్గా మాత యూత్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం అమ్మవారి ఎదుట యువతులు కోలాట నృత్యం ప్రదర్శించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.


తనయునితో తల్లి


కోలాహలంగా కోలాట నృత్యప్రదర్శన

వేడుకగా ఆశ్వయుజ మాస పౌర్ణమిపూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎన్‌జీజీఓస్‌కాలనీ కప్పరాడ శ్రీ వైభవ వెంకటేశ్వరుని దివ్యక్షేత్రంలో గురువారం ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉదయం 6-30కు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులను వేద మంత్రోచ్చరణతో అభిషేక ప్రదర్శన చేయించారు. అనంతరం వైభవునికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10గంటలకు జరిగిన సామూహిక విష్ణుసహస్రనామ పారాయణలో అధిక సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.


వైభవ వెంకటేశ్వరుడు

ఆక్రమణల్లో కాలిబాటలు..
రాకపోకలకు అవస్థలు


కేజీహెచ్ నుంచి జగదాంబకూడలికి వచ్చే మార్గంలో కాలిబాటపై బోరు తవ్వి వినియోగిస్తున్న దృశ్యం

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే

దక్షిణ నియోజకవర్గంలో రద్దీగా ఉండే జగదాంబ కూడలి, కేజీహెచ్ డౌన్, పూర్ణమార్కెట్, అల్లిపురం, కాన్వెంట్‌కూడలి తదితర ప్రాంతాల్లో కాలిబాటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రాంతాల్లో జీవీఎంసీ విశాలమైన కాలిబాటల(ఫుట్‌పాత్‌లు)ను నిర్మించింది. ప్రస్తుతం అవి పాదచారులకు ఉపయోగంలో లేకుండా పోయాయి. పోలీసు కమిషనర్, జీవీఎంసీ జోన్-4 కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న కాలిబాటలను సైతం కొందరు యథేచ్ఛగా ఆక్రమించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కేజీహెచ్ నుంచి జగదాంబ కూడలికి వచ్చే మార్గంలో కాలిబాటలపై ఓ భవన యజమాని బోరు తవ్వించారు. దాని వెంబడి గొట్టాలను ఏర్పాటు చేసినా అడిగేవారు కనిపించలేదు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు స్పందించడం లేదు.

★ జగదాంబ కూడలి నుంచి పూర్ణమార్కెట్, కొత్తరోడ్డు వరకు రహదారి వెంబడి దుకాణ యజమానులు కాలిబాటలను ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. కొంత మంది ఆర్టీసీ బస్ షెల్టర్లలోనే వ్యాపారం సాగిస్తున్నారు. దీంతో పాదచారులు రహదార్లపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీసులు స్పందించి కాలిబాటలపై ఆక్రమణలు తొలగించాలని పాదచారులు కోరుతున్నారు.


ఇలా అయితే రాకపోకలు ఏలా


బస్‌స్టాప్‌లో విక్రయాలు

ఎస్ఎల్ కెనాల్ అభివృద్ధికి ప్రణాళికలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని ఎస్ఎల్ కెనాల్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కెనాల్‌ను పరిశీలించారు. 2.2 కిలోమీటర్ల మేర విస్తరించిన గెడ్డలో వర్షాలు పడితే ఎక్కడికక్కడ వ్యర్థాలు అడ్డుపడటంతో నీరు నిలిచిపోతోందన్నారు. పోర్టు యాజమాన్యంతో చర్చలు జరిపి వారి సూచనలు తీసుకోవాలన్నారు. సీహార్స్ కూడలి నుంచి ఇందిర ప్రియదర్శిని స్టేడియం ఎదురుగా ఉన్న రహదారిపై బీటీ లేయర్ వేయాలన్నారు. ప్రధాన ఇంజినీరు శివప్రసాద్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

★ పరిశ్రమలకు అవసరమైన నీటిని మళ్లించడానికి నరవ నుంచి శీలానగర్ మీదుగా 1300 ఎంఎం ఎమ్ఎస్ పైపులైను వేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. గురువారం కోరమాండల్ కార్యాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నీటిని పైపులైను ద్వారా తరలించనున్నట్లు పేర్కొన్నారు.


ఎస్ఎల్ కెనాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు

జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: జాతీయ యువజనోత్సవాలు(యూత్ ఫెస్టివల్) ప్రజాతంత్ర-2024కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన కార్యాలయంలో అభినందించారు. నవంబరు 16 నుంచి 18వ తేదీ వరకు లక్నోలో జరగనున్న ఈ ఉత్సవాలలో ఏయూ నుంచి ఎం.శివాని లహరి, డి.హర్షిత పాల్గొంటారు. ప్రజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ఇండియా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.

అర్హత కలిగిన క్రీడాకారుల ఎంపిక

మురళీనగర్, న్యూస్‌టుడే : వైశాఖి స్పోర్ట్స్‌పార్కులో ఈనెల 20న రోల్‌బాల్ అండర్-14,17 బాలబాలికల ఎంపికలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి విశాఖకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు అర్హత కలిగిన క్రీడాకారులను ఈ ఎంపికకు తీసుకురావాల్సిందిగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.దేముడు కోరారు. మరిన్ని వివరాలకు 99121 08425లో సంప్రదించాల్సిందిగా రోల్‌బాల్ కోచ్ పూసర్ల సంతోష్‌కుమార్ వివరించారు.

20న చిత్రలేఖన, పెయింటింగ్ పోటీలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీ పాలబూత్‌కూడలిలోని సాయిబాబా ఆలయం ఎదురు రోడ్డులో నారాయణ స్కూల్ ఎదురుగా ఉన్న అబు ఎకాడమిలో ఎ డే ఆఫ్ ఆర్ట్ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖన, పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్.ఉషారాణి ఓ ప్రకటనలో తెలిపారు. టీం అబుచే డిజిటల్ స్టోరీ టెల్లింగ్ విత్ ఆర్ట్ ఇలస్ట్రేషన్స్ అనంతరం బహుమతుల ప్రదానోత్సవం జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 95156 53968, 95732 03455 నంబర్లకు ఫోన్ చేసి ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు.

వనితావాకర్స్ ప్రత్యేక సమావేశం

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-8 వైశాఖిస్పోర్ట్స్‌పార్కు వనితాభవన్‌లో గురువారం వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పొందూరు ప్రభావతి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొత్త కమిటీ ఏర్పాటు కోసం చర్చించారు. పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, కార్యదర్శి ఎం.జయ, క్లబ్ ప్రతినిధులు ఎం.ప్రమీలారావు, ఎస్.రత్నకుమారి, కె.భానుమతి, సి.హెచ్.జ్యోతి,సురేందర్ కౌర్, ఎం.స్వాతిమాధురి హాజరయ్యారు.


సమావేశంలో పాల్గొన్న వనితావాకర్స్ సభ్యులు

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

మాధవధార, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని రవాణా శాఖ డీటీఓ జి.ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం రవాణా కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్టీవో ఆర్.సి.హెచ్.శ్రీనివాస్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీటీఓ జి.ఆదినారాయణ, సిబ్బంది

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతిని గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేయరు గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ పి.సంపత్‌కుమార్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయరు మాట్లాడుతూ సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని రాసి మానవాళికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, ఏడీసీలు ఎస్ఎస్ వర్మ, రమణమూర్తి, సోమన్నారాయణ, వ్యయ పరిశీలకుడు వాసుదేవరెడ్డి, డీపీఓ ఎంవీడీ ఫణిరాం తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ పి.నారాయణమూర్తి, ఇతర అధికారులు వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు.


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయరు హరి వెంకట కుమారి, కమిషనర్ సంపత్‌కుమార్


జడ్పీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న జడ్పీ సీఈఓ నారాయణమూర్తి

'ఆస్తి కోసం వేధిస్తున్నారు..'

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: అంధుడైన తనకు భార్య, ఆమె కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని సారెళ్ల శ్రీధర్ కోరారు. గురువారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హెచ్‌బీ.కాలనీలో ఉంటున్న తనకు కొత్తవలసకు చెందిన మహిళతో 2006లో వివాహమైందన్నారు. కొంతకాలం సంసారం సాఫీగా సాగిందన్నారు. తర్వాత ఆమె కుటుంబ సభ్యులు తన ఆస్తి కోసం పోలీసు స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు చేసి వేధించడం ప్రారంభించారన్నారు. దీనిపై పోలీసులు స్టేషన్‌లో తాను ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలుకు పటిష్ఠ చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాటాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైసు మిల్లర్ల సంఘం ప్రతినిధులు ఖాళీ గోనె సంచులను సమకూర్చాలన్నారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు ఎం.శ్రీలత, డీసీఎస్ఓ భాస్కర్‌రావు, డీసీసీబీ సీఈఓ వర్మ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు

ఆరిలోవ, న్యూస్‌టుడే: తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ గురువారం మైనాపల్లె కాలనీలో ఉన్న సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్‌కు ఫిర్యాదు కాపీ అందజేశారు. వివరాల్లోకి వెళితే.. 'గత ఏడాది ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థలో అవినీతి జరిగిందని నిరాధారమైన ఆరోపణలతో చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఆ ఆరోపణలలో వాస్తవం లేదని ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఏమీ జరగకపోయినా అన్యాయంగా చంద్రబాబును అరెస్టు చెయ్యడంతో అప్పట్లో చాలా మంది చంద్రబాబు అభిమానులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. చనిపోయిన వారి కుటుంబాలు ఎవరు అండగా నిలుస్తారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి. దీనికి సీఐడీ బాధ్యత వహించాలి. చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయాలని ఆదేశించిన గత ప్రభుత్వ పెద్దలను తక్షణమే అరెస్టు చెయ్యాల'ని కోరారు.

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

సిబ్బంది తీరుపై డీసీపీ-2 తీవ్ర అసహనం

మాధవధార, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల నుంచి త్వరితగతిన ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరించాలని విశాఖ జోన్-2 డీసీపీ మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆమె వచ్చేటప్పటికి స్టేషన్ బయట ఫిర్యాదు దారులు పెద్ద సంఖ్యలో ఉండటంతో స్టేషన్ సిబ్బంది తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక కేసు నిమిత్తం కోడి పుంజులను తీసుకువచ్చి స్టేషన్‌లో ఉంచడంతో ఆ ప్రాంగణమంతా అపరిశుభ్రంగా మారడంతో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పెండింగ్ కేసులు ఎన్ని పరిష్కరించారు, రోజుకి ఎంత మంది ఫిర్యాదుదారులు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు వచ్చే సిబ్బంది హాజరు, పనితీరు పట్ల ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో చేపట్టవలసిన పలు అంశాలపై సూచనలు చేశారు.

యా..హూ... సాధన చేస్తూ.. యశస్విని..!

కరాటేలో రాణిస్తున్న ఎనిమిదో తరగతి బాలిక

పట్టుదల, ఆసక్తితో కరాటేలో సాధన చేస్తుంది చిన్నారి. తల్లిదండ్రులు, శిక్షకులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. ఇప్పటికే అనేక పతకాలను సొంతం చేసుకుని పలువురి ప్రశంసలు అందుకుంది.
-న్యూస్‌టుడే, మల్కాపురం



పారిశ్రామిక ప్రాంతం 59వ వార్డు శ్రీహరిపురానికి చెందిన వల్లి యశస్విని (12) ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. బాలిక తండ్రి పోలు ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. తల్లి చిన్ని గృహిణి. కుమార్తెకు ఆరేళ్ల వయసులోనే కరాటేపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు కోచ్ శ్రీనివాసరావు వద్దకు శిక్షణకు పంపించారు. నాటి నుంచి సాధన చేస్తున్న బాలిక.. చేస్తూ... పోటీలకు హాజరవుతూ, పతకాలు సొంతం చేసుకుంటుంది.

ఇ ది ప్ర తి భ

- 2021లో విశాఖలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది.
- 2022లో నగరంలో జరిగిన ఆసియా ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో, అంతర్జాతీయ, జాతీయ, జిల్లాస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు, రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సొంతం చేసుకుంది.
- 2023లో వైజాగ్‌లో జరిగిన జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు తన ఖాతాలో వేసుకుంది.



అంతర్జాతీయ పోటీలో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్న యశస్విని

- 2023లో ఒడిశాలో జరిగిన అండర్ రాష్ట్ర పోటీల్లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

లక్ష్యం : భవిష్యత్తులో భారత్ తరఫున అనేక పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించడంతో పాటు, దేశానికి మంచి పేరు తీసుకురావడమే లక్ష్యమని యశస్విని చెబుతోంది.

ఆందోళనలు ఎవరి కోసం..!

ఉక్కు కార్మిక సంఘాల తీరుపై పలువురి ఆగ్రహం

28న సమ్మె నిర్వహణపై తర్జనభర్జన

న్యూస్‌టుడే, విశాఖపట్నం

విశాఖ ఉక్కు కర్మాగారంలో నిర్వహిస్తున్న సమ్మెలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలతో కార్మికులే బలిపశువులవుతున్నారు. కార్మిక సంఘాల నాయకులు మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికారులతో చేతులు కలుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



ఈ నెల 28న ఉక్కులో సమ్మె ఉంటుందని ఇటీవల కార్మిక సంఘాల నాయకులు సంస్థ యాజమాన్యానికి నోటీసు ఇచ్చారు. జాతీయ సంఘాల పిలుపుతో సమ్మె చేస్తామంటూ నాయకులు ప్రకటిస్తున్నా..., ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుమారు 1345 రోజుల నుంచి దీక్షలు కొనసాగుతున్నా ఎన్నడూ జాతీయ సంఘాలు స్పందించలేదు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..: ఎప్పుడు జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు ఇచ్చినా... విశాఖ ఉక్కులో కార్మిక సంఘాలు ఆయా విభాగాల్లో కార్మికుల్ని బలవంతంగా విధులకు హాజరవకుండా చేస్తూ, సమ్మెలు నిర్వహిస్తున్నాయి. అదే సెయిల్‌లో అయితే జాతీయ సంఘాల పిలుపునకు స్పందన ఉండదు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు విధులకు హాజరవుతుంటారు. జాతీయ సంఘాల సమస్యలు, డిమాండ్లపై ఇక్కడ ఎందుకు సమ్మె చేయాలంటూ వారు ప్రశ్నిస్తుంటారు.

స్థానిక సమస్యల ప్రస్తావనేది..?: విశాఖ ఉక్కులోనే ప్రస్తుతం అనేక సమస్యలు ఉన్నాయి. వాటిల్లో ప్రధానంగా 100 శాతం ప్రైవేటీకరణ నిలిపేయడం, సెయిల్‌లో విలీనం, నిర్వాసితులకు ఉపాధి, ఇంటి అద్దె అలవెన్సులు, విద్యుత్తు ఛార్జీల తగ్గింపు, గనుల కేటాయింపు, బోనస్ చెల్లింపు, సెయిల్ మాదిరిగా వేతన సవరణ. ఇలాంటి డిమాండ్లపై జాతీయ కార్మిక సంఘాలు స్పందించేనే.. ఇక్కడ సమ్మె చేస్తామని కొందరు కార్మికులు బహిరంగంగానే చెబుతున్నారు.

- కార్మికులకు అదనపు ఆర్థిక ప్రయోజనాలు వచ్చిన వెంటనే, కనీసం ప్రతి నెల వేతనాలు సకాలంలో చేతికందే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ సమయంలో సమ్మెలు, ధర్నాలు చేయడం అవసరమా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.
- ఇప్పటికైనా ఆయా కార్మిక సంఘాల నాయకులు తమ తీరు మార్చుకుని కర్మాగారం అభివృద్ధికి, కార్మిక సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, పెదగంట్యాడ, గాజువాక

కాలువలు నిర్మించరూ?: గాజువాక బీసీరోడ్డు దయాల్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఇటీవల వర్షాలకు కాలువలు ధ్వంసమై మురుగు ముందుకు కదలడం లేదు.
-సన్యాసిరావు, బీసీరోడ్డు

✔: పరిశీలించి పక్కా డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
-డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

?: గాజువాక సమీప సంజీవకాలనీలో 40ఎ-3-4 వీధి దీపం నెలరోజులుగా వెలగడం లేదు. చీకట్లో నానా ఇబ్బందులు పడుతున్నాం.
-కె.రాకేశ్ వర్మ, సంజీవకాలనీ

✔: వీధి దీపాలను పునరుద్ధరిస్తాం.
-శివ, వీధి దీపాల నిర్వాహకుడు

ఉక్కు పరిరక్షణకు హోమం



ఉక్కునగరంలో హోమం చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం రావాలని కోరుతూ గురువారం ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి, సప్తరుషి వేద పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. గురువులు ఎం.మాధవశర్మ, శ్రీరామ్‌నగర్, దువ్వాడ సప్తరుషి వేద పాఠశాల ప్రతినిధులు, ప్రొఫెసర్ వి.ఎస్.ఆర్.మూర్తి, సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, విశాఖ ఉక్కు ఫైనాన్స్ విభాగం సీజీఎం వి.శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అర్చకులు తొలుత స్వామికి పూజలు చేశారు. వర్షంలోనూ ప్రదక్షిణ పూర్తి చేశారు. అర్చకులు భావనారాయణ, మనోజ్, హరి నారాయణ పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం(శీలానగర్), న్యూస్‌టుడే : శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో పౌర్ణమి సందర్భంగా గురువారం తిరుమల బాలాజీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని, ఉత్సవమూర్తుల్ని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం స్వామిని పల్లకీలో ఊరేగించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

అమ్మవారికి దీపారాధన

కూర్మన్నపాలెం(వడ్లపూడి), న్యూస్‌టుడే : దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వాసిత వడ్లపూడి ఎన్టీఆర్ పార్కులో ప్రత్యేక దీపారాధన ఏర్పాటు చేశారు. దుర్గా గణేష్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి రూపంలో దీపాలు వెలిగించారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్ హాజరై పూజలు చేశారు.



వడ్లపూడి ఎన్టీఆర్ పార్కులో...

'విశ్వకర్మ పథకం'... ఓ వరం : పల్లా



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందిస్తున్న పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం చేతి వృత్తుల వారికి ఓ వరంలాంటిదని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక జోనల్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్సీ శేషాద్రి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లా మాట్లాడుతూ... సుమారు 18 రకాల చేతివృత్తుల వారికి విశ్వకర్మ పథకంతో మేలు జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కూటమి నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, గడసాల అప్పారావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, రాజాన రామారావు, పల్లా శ్రీనివాస్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనలు ఉండాలి



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా (జవహర్‌నగర్), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో గురువారం 61వ వార్డు శెట్టిబలిజ వీధిలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. అర్బన్ జిల్లా తెదేపా కార్యదర్శి కాకి పోలిరెడ్డి, వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ పాల్గొన్నారు.

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో జరిగిన అమ్మవారి పూజల్లో జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బోగవల్లి నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షులు సత్యాల మహేష్. బాబూరావు తదితరులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వాల్మీకి మహర్షి జయంతి

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ధర్మసత్రం కూడలిలో గురువారం మహాత్మా గాంధీ స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. జీవీఎంసీ 79వ వార్డు తెదేపా సీనియర్ నాయకుడు కరణం సత్యారావు ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక నాయకులు కరణం పైడిరాజు, చిత్తా బుజ్జి, నక్కా రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక జీవీఎంసీ కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం వాల్మీకి సేవల్ని కొనియాడారు.



అగనంపూడిలో నివాళి అర్పిస్తున్న సభ్యులు

వర్షాలకు కూలిన షెడ్డు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : ప్రస్తుత వర్షాలకు పెదగంట్యాడ మండలం కొంగపాలెంలో గురువారం ఉదయం ఓ షెడ్డు కూలింది. ఆ వివరాలు... నక్కా రెడ్డి(45), అతని భార్య శ్యామలా స్థానికంగా నివాసం ఉంటున్నారు. భార్య ఇంట్లో వంట చేస్తుండగా, వెనుక ఉన్న పాత షెడ్డులో రెడ్డి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఉదయం ఆరున్నర గంటల సమయంలో శిథిలమైన పాత షెడ్డు ఒక్కసారిగా కూలిపోవడంతో... అందులో ఉన్న రెడ్డి పరుగున బయటకు వచ్చేశారు. ఆ సమయంలో అతడి కాలికి గాయమైంది. ఉలిక్కిపడిన శ్యామలా గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి బాధితుడిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

మహిళ పుస్తెల తాడు చోరీ

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే : మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ అయిన ఘటనపై గురువారం బాధితులు తెలిపిన వివరాలివి. నాతయ్యపాలెంలోని చివరి వీధిలో గేదెల దుర్గారావు, పైడమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం 6 గంటల సమయంలో పైడమ్మ ఇంటి ఎదుట పువ్వులు కోస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఏదో చిరునామా వివరాలు అడిగారు. ఆమె సమాధానం చెప్పేలోపే... మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కెళ్లిపోయారు. సమాచారం అందుకున్న గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం..

మానసిక రోగి... ఆసుపత్రికి తరలింపు

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : మర్రిపాలెం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న మతిస్థిమితం లేని మహిళ(38)ను ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం గుర్తించారు. వెంటనే 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ ఎ.మమతకు సమాచారం అందించారు. మమత అక్కడకు చేరుకుని బాధితురాలిని మెరుగైన వైద్యం కోసం కేర్ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై పీకే.రౌల్, కానిస్టేబుల్ అనిత ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: ఎన్ఏడీకూడలి పైవంతెన సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (38) తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. బంధువులు ఎవరూ లేకపోవడంతో ఎయిర్‌పోర్టు పోలీసులు అనాథ మృతదేహంగా గుర్తించారు. గురువారం వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ చొరవతో అంత్యక్రియలు నిర్వహించారు. కానిస్టేబుల్స్ శివ, సాగర్, సతీశ్, నరసింహ, సాయి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం శ్రీ దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు, భారత్ డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ... చిన్నారుల దంత సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ట్రస్టు నిర్వాహకులు రాంబాబు, పాఠశాల కమిటీ ప్రతినిధులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయలు వర్ధంతి

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : నడుపూరు శ్రీ కృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ కృష్ణదేవరాయలు వర్ధంతి సందర్భంగా చినగంట్యాడ కూడలిలోని విగ్రహానికి నివాళి అర్పించారు. గాజువాక కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు జెర్రిపోతుల ముత్యాలు, సభ్యులసంతోశ్, మనోజ్, షణ్ముఖ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక సినిమాలు

కన్య: **దేవర**, హెవెన్: **జనక అయితే గనక..** శ్రీకన్య, లక్ష్మి, హెవెన్, అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం): **వేట్టయన్**, మోహినీ 70ఎంఎం: **విశ్వం** లక్ష్మీకాంత్: **స్వాగ్**, మినీ మోహినీ: **మార్టిన్**, మోహినీ: **జిగ్రా**, విశేష్: **మా నాన్న సూపర్ హీరో**

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: **వేట్టయన్** స్క్రీన్-3: **విశ్వం**, స్క్రీన్-4: **దేవర** స్క్రీన్-1: **జనక అయితే గనక**

గోపాలపట్నంలో: శ్రీనరసింహ: **జనక అయితే గనక**, నరసింహ: **వేట్టయన్** సౌజన్య: **విశ్వం**, సుకన్య: **దేవర** మౌర్య: **మార్టిన్**



ఓ కేసు నిమిత్తం కోర్టు వాయిదాకు హాజరయ్యేందుకు గురువారం రాత్రి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా పుష్పగుచ్ఛాలు అందించి.. సాదర స్వాగతం పలికారు.
-న్యూస్‌టుడే, గోపాలపట్నం

పాఠశాల మైదానం అభివృద్ధికి చర్యలు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కూర్మన్నపాలెం సమీప కణితి ఉన్నత పాఠశాల మైదానం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాల, బాలికల పోటీలు నవంబరులో అక్కడే నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల మైదానం బాగు చేయాలని ప్రధానోపాధ్యాయులు బి.సూర్యప్రకాశరావు స్థానిక కార్పొరేటర్ బొండా జగన్ నేతృత్వంలో పల్లా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గురువారం మైదానాన్ని పరిశీలించారు. పోటీలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులంతా కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు. వార్డు నాయకులు విజయరామరాజు, సత్తిబాబు, వి.రాంబాబు, కె.శ్రీనివాసవర్మ, ఎస్.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లాను సత్కరిస్తున్న కణితి పాఠశాల ఉపాధ్యాయులు

కార్మిక సమస్యలపై విన్నపం

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కులో ఒప్పంద కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు చొరవ చూపాలని పలువురు కోరారు. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు గురువారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గాజువాకలో కలిసి వినతి పత్రం అందించారు. చాలా మంది కార్మికులకు వేతనాలు అందడం లేదని, కొన్ని విభాగాల్లో టెండర్లు పూర్తికాక సుమారు 600 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని వివరించారు. ఆయా సమస్యలపై యాజమాన్యంతో చర్చిస్తామని పల్లా హామీ ఇచ్చినట్టు కార్మిక నాయకులు తెలిపారు.

పరిశుభ్రత... అందరి బాధ్యత

కరాస, న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రత. . అందరి బాధ్యత అని, స్వచ్ఛ కార్యక్రమాల్లో నేటి పౌరులు విధిగా పాల్గొనాలని రైల్వే సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బి.షణ్ముఖరావు సూచించారు. మర్రిపాలెం సమీప రైల్వే ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛ అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైల్వే ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు, సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొని రైల్వేకాలనీ, ఈఎల్ఎస్ ప్రాంతాల్లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.అశోక్‌కుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఆర్‌డీ.సాహు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో రైల్వే ఉన్నతాధికారులు, కార్మికులు, విద్యార్థులు

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు పీడీ సీహెచ్.రాంబాబు తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగిన అండర్-20 విభాగంలో కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన టి.ప్రణవశ్రీ, కె. మోనాలి 4/400 రిలే పరుగులో బంగారు, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ప్రతిభ చూపిన వారికి గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ జె.సుధాకర్ అభినందించారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ సతీష్, మెకానికల్ విభాగాధిపతి రాంబాబు, పీడీలు జె.ప్రశాంత్, పీఎస్‌వీ రమణ పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

పారిశ్రామిక రంగానికి తీరనిలోటు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువత ఎందరికో ఉపాధి కల్పించిన దివంగత పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటని గోపాలపట్నం కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.సోములు అన్నారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పేదల కోసం కోట్ల రూపాయలను విరాళంగా ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సభ్యులు జి.రామదాసు, సీహెచ్.సుబ్బారావు, కెఎన్ఆర్.రావు, వెంకట్, జగదీశ్, విశ్వేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.



రతన్ టాటా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సభ్యులు

ఇక్కడ పడితే.. అంతే..!



ఫోకస్

కొత్తపాలెం- నరవ రహదారిలో..

వాతావరణ మార్పులతో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రహదారులన్నీ నీట మునగడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి పరిసరాల్లో కురిసిన భారీ వర్షానికి కాలువలన్నీ పొంగి పొర్లాయి. పూడిక వ్యర్థాలన్నీ రహదారులపైకి చేరడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లింది. గోపాలపట్నం సమీప కొత్తపాలెం- నరవ ప్రధాన రహదారిలోని గోతుల్లోకి వరద నీరు చేరడంతో... గోతులన్నీ చెరువుల్లా మారాయి.
-న్యూస్‌టుడే, గోపాలపట్నం(కొత్తపాలెం)

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నీలో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో కడపతో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నానికి మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు నిర్ణీత 39 ఓవర్లలో 234/5 స్కోరు చేసింది. రామ్‌చరణ్ 80, వినోద్ 52, తమన్‌రెడ్డి 51 పరుగులు చేయగా, సాయికృష్ణచైతన్య 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 98/4 స్కోరు చేసింది.